సాక్షి 24|7
నాగర్‌కర్నూల్
గురువారం 4-1-2018

హోటల్‌కు వెళ్లి తాగుతున్నాం



విశ్రాంతి సమయంలో, మధ్యాహ్న భోజన సమయంలో నీళ్లు తాగేందుకు రోడ్డుపై ఉన్న హోటళ్లకు వెళుతున్నారు. ఒక్కో సారి నీళ్లు తీసుకుని తాగుతున్న సమయంలో హోటల్‌వాళ్లు తిడుతున్నారు. స్కూల్‌లో సారోళ్లను అడుగుతున్నాం. అయినా లాభం లేదు. మేం హాస్టల్ నుంచి వస్తున్నాం కాబట్టి వాటర్ బాటిళ్లను సైతం తెచ్చుకోలేకపోతున్నాం.

– ఆకాష్, యూపీఎస్ పాఠశాల, నాగర్‌కర్నూల్



నాగర్ కర్నూల్‌లోని కేసరిసముద్రం చెరువు వద్ద పూర్తికావొచ్చిన కట్ట

టకటకా..
ట్యాంక్ బండ్లు!

- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో చురుకుగా పనులు
- గద్వాలలో మాత్రం ప్రారంభం కాని వైనం
- కొన్నిచోట్ల కోర్టు కేసులతో జాప్యం

జూన్ నాటికి పనులు పూర్తి కావాలని అధికారుల లక్ష్యం

మరికల్: హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ తరహాలో ప్రజలు సేదతీరేలా ప్రతీ నియోజకవర్గంలో ఒక చెరువును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లు ఖరారు చేయగా.. పలువురు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్ణయించిన చెరువు కట్టలను వెడల్పు చేయడం వరకు వచ్చాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా.. పనులు ముందుకు సాగుతుండడంతో స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

ఆహ్లాదం.. ఆనందం

చాలా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజలు సాయంత్రం సేద తీరుదామంటే పార్కులు సైతం లేని పరిస్థితి. దీంతో ప్రతీ నియోజకవర్గానికి ఓ చెరువును ఎంపిక చేసి కట్ట వెడల్పు, వాకింగ్ ట్రాక్, గార్డెనింగ్, బోటింగ్ ఇత్యాది పనులు చేయాలని ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు

- దాహం తీర్చుకునేందుకు హోటళ్లకు పరుగెడుతున్న వైనం
- జిల్లాలో 480 పాఠశాలల్లో తాగునీటి కరువు
- నీళ్లు ఉన్నా వేధిస్తున్న ఫ్లోరైడ్ సమస్య
- నిరుపయోగంగా నీటి శుద్ధి యంత్రాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కల్వకుర్తి: ఊర్కొండపేట ప్రాథమిక పాఠశాలలో చేతిపంపు వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థులు



వేసవికి ముందే తండ్లాట!

చందుబట్లలో వృథాగా ఉన్న శుద్ధ జలం ప్లాంట్



- జిల్లాలోని మొత్తం పాఠశాలలు 897
- చేతి పంపులు ఉన్న పాఠశాలలు 163
- కొళాయిలు ఉన్న పాఠశాలలు 247
- బావి నీటి సౌకర్యం ఉన్నవి 07
- నీటి సౌకర్యం లేనివి 480
- తాగునీటి వసతి కలవి 417

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: వేసవికి ముందే సర్కారు బడుల్లో విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో నీటి వసతి ఉన్నా ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అయితే కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం అనంతరం రోడ్డుపక్కన హోటళ్లకు పరుగులు తీస్తున్నారు. మిగతా విద్యార్థులంతా ప్లేట్లు కడిగే నీటినే తాగడానికి కూడా ఉపయోగించాల్సిన దుస్థితి. బోరుబావులు, నల్లా నుంచి వచ్చే ఫ్లోరైడ్, కలుషిత నీటిని వాడి అనారోగ్యం పాలవుతున్నారు. దీనికితోడు విద్యార్థుల మేధాశక్తి కుంటుపడుతోంది. చురుకుగా ఉండే విద్యార్థులు సైతం విద్యలో వెనకబడిపోవడానికి తాగునీరు కూడా ఓ కారణమని వైద్యులు సైతం చెబుతున్నారు.

స్పందించని విద్యాశాఖ ప్రతినిధులు

విద్యార్థుల సౌకర్యార్థం నాలుగేళ్ల క్రితం మండలానికి నాలుగు పాఠశాలల చొప్పున ఎస్‌బీఐ అధికారులు మినీ వాటర్ ప్లాంట్లను వితరణ చేశారు. కానీ అవి

మిగతా 2వ పేజీలో ▶



వ్యూహరచన!

- సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ఎమ్మెల్యేలు
- నియోజకవర్గంలో బలపడేందుకు వినూత్న కార్యక్రమాలు
- కొత్త సంవత్సరమే అందరికీ కీలకం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు వచ్చేలా పావులు కదువుతున్న వైనం
- ప్రజలకు చేరువయ్యేందుకు నేతల తహతహ

సాక్షి, నాగర్‌కర్నూల్: సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉండడంతో అన్నిపార్టీలు ముందస్తు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రజల మన్ననలు పొంది వారి ఆమోదం పొందేందుకు ఈ కొత్త సంవత్సరమే కీలకమైనది. సింగిల్‌విండోతో పాటు గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలకు ఈ ఏడాదినే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉండడంతో 2018 తమకు కలిసి రావాలని ఔత్సాహిక నేతలు కోరుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ కొత్త జిల్లాగా అవతరించిన తర్వాత జిల్లాలో రాజకీయాల్లో సమీకరణలు మారుతూ వస్తున్నాయి. 2019 అసెంబ్లీ సాధారణ ఎన్నికల కోసం ప్రస్తుత ఎమ్మెల్యేలు, వారి ప్రత్యర్థులు సమాయత్తమవుతుండగా వారి మద్దతుదారులను కిందిస్థాయిలో గెలిపించుకుంటే వారి మద్దతుతో అసెంబ్లీ, పార్లమెంట్‌కు వెళ్లవచ్చని బడా నేతలు ఆలోచిస్తున్నారు. నాలుగేళ్లు పనిచేసింది ఒక ఎత్తయితే ఈ ఏడాది చేసే పని ఒక ఎత్తు కానున్నడంతో వీరంతా ప్రజలకు చేరువయ్యేందుకు పావులు

మిగతా 2వ పేజీలో ▶

బాలికలకు వరం

- 'కాస్మొటిక్' కిట్లు అందజేస్తున్న ప్రభుత్వం
- కస్తూర్బాల విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే 15 ఉత్పత్తులు
- ఉమ్మడి జిల్లాలో 11,164 మందికి లబ్ధి
- పంపిణీని ప్రారంభించిన మంత్రి లక్ష్మారెడ్డి

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

వివరాలు 3లో ▶

వ్యూహరచన!

▶ మొదటి పేజీ తరువాయి

కదుపుతున్నారు. జిల్లాలో ఇప్పటికే కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌లు పోటాపోటీగా సభలు, పాదయాత్రలు నిర్వహిస్తూ వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్నప్పటి రాజకీయ పరిస్థితులకు, ప్రస్తుతం ఉన్నవాటికి వ్యత్యాసం ఎంతో ఉంది. జిల్లాలోన నాలుగు నియోజకవర్గాల్లో మూడు నియోజకవర్గాలను గుప్పెట్లో పెట్టుకున్న టీఆర్‌ఎస్ ఆ పట్టును నిలబెట్టుకోవడంతో పాటు మిగిలిన ఒక స్థానాన్ని కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కొల్లాపూర్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గ అభివృద్ధిపై ఈ ఏడాది పూర్తిస్థాయి దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన వారంలో కనీసం మూడు రోజులు నియోజకవర్గ ప్రజల మధ్య గడుపుతున్నారు. పెళ్లిళ్లకు, పేరంటాలకు విధిగా హాజరవుతుండటమే కాక ఏదైనా ఆపద ఎదురైన కుటుంబాల వారిని ప్రత్యేకంగా ఇంటికి వెళ్లి కలుస్తున్నారు. తండ్రికి తోడుగా జూపల్లి తనయుడు అరుణ్ వారంలో రెండు రోజులు కొల్లాపూర్‌లో మకాం వేసి, ప్రజల్లోకి వెళుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు తండ్రి, కొడుకులు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో..

నాగర్‌కర్నూల్‌లో సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా కొనసాగిన నాగం జనార్దన్‌రెడ్డి స్థానంలో అనూహ్యంగా తెరపైకి వచ్చి టీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన మర్రి జనార్దన్ రెడ్డి కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా సేవాకార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ అనుకూలంగా మార్చుకుంటున్నారు. మరోవైపు కేఎల్‌ఐ కాల్వల వెంట 6రోజుల పాటు 135 కిలోమీటర్ల మేర చేపట్టిన పాదయాత్రకు మంచి స్పందన వచ్చింది. నియోజకవర్గంలో పట్టును పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

వ్యూహాలు రచిస్తున్న గువ్వల

అటవీ ప్రాంతం అత్యధికంగా ఉన్న రిజర్వ్ అసెంబ్లీ నియోజకవర్గం అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు తన పట్టును నిలబెట్టుకునేందుకు ప్రత్యేకంగా వ్యూహరచన చేసి 2018లో దాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. తన నియోజకవర్గానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆశించిన మేర సాగునీరు అందకపోవడం వల్ల అక్కడి రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కాకుండా ఉండేందుకు పాదయాత్ర నిర్వహిస్తానని ప్రకటించారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానని, ఇది తప్పని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానంటూ ఇటీవల ప్రకటించడం వార్తల్లోకెక్కింది. మరోవైపు ఇతర పార్టీల నుంచి వచ్చే విమర్శలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ ఆయన పార్టీ పరంగా మంచి గుర్తింపు పొందారు. తిరిగి అచ్చంపేటలో గెలుపొందేందుకు నియోజకవర్గంలోని అన్ని వర్గాల వారి మద్దతును కూడగట్టుకునేందుకు ప్రత్యేకంగా శ్రమిస్తున్నారు.

ప్రభుత్వంపై పోరాటాల ద్వారా వార్తల్లోకెక్కిన వంశీ

రాష్ట్రంలోని అధికార టీఆర్‌ఎస్‌పై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తూ కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ ఏడాదిలో తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ఆయన టీఆర్‌ఎస్‌పై మరిన్ని ఆయుధాలను ఎక్కుపెట్టి ఉంచారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా తన నియోజకవర్గానికి నీరందించిన ఘనత కాంగ్రెస్‌దేనన్న అంశాన్ని బలంగా వినిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాల విభజన సందర్భంగా రెండు జిల్లాల్లోని కల్వకుర్తి నియోజకవర్గంలో తన పట్టు సడలకుండా చూసుకుంటున్నారు. యువతకు అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకునేందుకు వంశీచంద్ తనదైన శైలిని అవలంబించనున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై 'టీమాస్' పోరాటం

బల్మూర్: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కోసం ప్రజా సంఘాలన్నీ సంఘటితం కావాలని టీమాస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. టీమాస్ అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం బల్మూరులోని చెంచుకాలని, కేజీబీవీ, వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో నిరంకుశ పాలనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో సభ్యులు పర్వతాలు, శ్రావణ్‌కుమార్, లాల్‌అహ్మద్, శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

వేసవికి ముందే తండ్లాట!



ఊర్కొండ: ఇప్పపాడులో ఇంటినుంచి వాటర్‌బాటిళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

▶ మొదటి పేజీ తరువాయి

కొన్నాళ్లకే మోరాయించాయి. వీటి నిర్వహణపై పాఠశాల సిబ్బంది శ్రద్ధ చూపకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం అవి దిష్టి బొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ప్రతి పాఠశాలకు శుద్ధ జలం ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫ్లోరైడ్ నీరే గతి..

జిల్లాలో 623 ప్రాథమిక, 131యూపీఎస్, 143ఉన్నత మొత్తం 897పాఠశాలల్లో 37,978 బాలురు, 38,172 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా 163పాఠశాలల్లో చేతిపంపులు ఉన్నాయి. 247పాఠశాలల్లో నల్లా నీటి సౌకర్యం ఉండగా, ఏడు పాఠశాలల్లో బావినీటి సౌకర్యం ఉన్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే వీటిలోనూ దాదాపు అన్నింటిలో ఫ్లోరైడ్ నీరే ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే విద్యార్థులు తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది విద్యార్థులు తమ పుస్తకాలతో పాటు ఇంటి నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే విద్యార్థులు వారి వయసుకు మించి బరువు పుస్తకాలను మోస్తున్న తరుణంలో వారి ఇంటి నుంచి తెచ్చుకునే వాటర్ బాటిల్ కూడా అదనపు బరువు అవుతోంది.

ఉపాధ్యాయులే స్వచ్ఛందంగా..

జిల్లావ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో అక్కడక్కడా దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల ద్వారా ప్లేట్లు, చేతులు కడిగేందుకు, తాగేందుకు వాడుతున్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయులే ఉమ్మడిగా ప్రతి తరగతి గదికి ఒక నీటి డబ్బాను ఏర్పాటు చేసి, అందులో ప్రతిరోజు మినరల్ వాటర్‌ను పోయిస్తున్నారు. దీనిని గమనించిన కొంత మంది ప్రజాప్రతినిధులు కలిసి వాటర్ ట్యాంక్ ప్లాంట్‌ను నెలకొల్పారు.

స్పెషల్ గ్రాంట్ ఏమీ లేదు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకించి శుద్ధ జలం ఏర్పాటు చేయాలని స్పెషల్ గ్రాంటేమీ లేదు. ఆయా పాఠశాలల్లో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడి సహకారంతో దాతల సహకారంతో ఏర్పాటు చేసుకుంటున్నారు. మరీ జఠిలంగా ఉన్న పరిస్థితిలో పాఠశాల అభివృద్ధి నిధుల నుంచి కొంత మేర ఖర్చు చేసుకోవచ్చు. జిల్లాలో కస్తూర్బా పాఠశాలల్లో మాత్రం సర్వశిక్షా అభియాన్ నిధుల నుంచి ప్రత్యేకించి నూతన ప్లాంట్లు ఏర్పాటు చేశాం.

– జనార్దన్‌రావు, డీఈఓ

కల్యాణలక్ష్మిని సద్వినియోగం చేసుకోవాలి



రెడ్డిసేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

అచ్చంపేట: పేద రెడ్లకు కూడా ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేస్తోందని, దీని మండల, గ్రామస్థాయిలో ఉపయోగించుకోవాలని రెడ్డి సేవా సమితి జిల్లా ఫౌండర్ చిన్నారెడ్డి, సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి అన్నారు. బుధవారం అచ్చంపేట తాలుకా రెడ్డి సేవా సమితి భవనంలో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షల సంవత్సర ఆదాయం ఉన్న ప్రతి రెడ్డి వర్గానికి చెందిన వారికి కల్యాణలక్ష్మి వర్తిస్తుందన్నారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడి పేదలకు న్యాయం చేయాలన్నారు. పేదరెడ్లను, వారి పిల్లలను ఆదుకునే విధంగా కమిటీలు పని చేయాలన్నారు. గ్రామ, మండల, పట్టణస్థాయిలో కమిటీలను ప్రతిష్టం చేయాలన్నారు. దాతల సహకారంతో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పుస్తకాలకు ఆర్థిక సహాయం చేయడం వల్ల విద్యలో వారు రాణించగలుగుతారని చెప్పారు. రెడ్డి బంధువులందరూ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. రెడ్డి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, జెడ్పీటీసీలు కసిరెడ్డి రామకృష్ణారెడ్డి, కట్టా సరితా అనంతరెడ్డి, ఎంపీపీ తిప్పర్తి అరుణ నర్సింహారెడ్డి, నాయకులు సరేందర్‌రెడ్డి, మారం గోవర్ధన్‌రెడ్డి, జె.గోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, సీఎం రెడ్డి, వేపూరి రాఘవరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డిపాల్గొన్నారు.

టకటకా.. ట్యాంక్ బండ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి ఓ చెరువును గుర్తించారు.

మహబూబ్‌నగర్‌లో 90 శాతం

- రాష్ట్రంలోనే మొదటగా మహబూబ్‌నగర్ పెద్ద చెరువును ఎంపిక చేయగా 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా జిల్లాలోని దేవరకద్ర, మక్తల్ పాటు నారాయణపేట నియోజకవర్గంలో జాతీయ రహదారిపై ఉన్న మరికల్ పెద్ద చెరువులను మినీ ట్యాంక్ బండ్ల కోసం ఎంపిక చేశారు. గత ఏడాది మే నెలలో టెండర్లను అహ్వానించి జూన్‌లో ట్యాంకు బండ్ నిర్మాణాలకు కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో మక్తల్, దేవరకద్ర పెద్దచెరువుల ఆనకట్ట వెడల్పు పనులు మాత్రమే జరగగా మరికల్ పెద్దచెరువు ఆనకట్ట వెడల్పు పనులు ప్రస్తుతం చురుకుగా సాగుతున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం, అచ్చంపేట చెరువులను మినీట్యాంక్‌బండ్‌గా మార్చే పనులు సాగుతున్నా, కొల్లాపూర్ పెద్దచెరువుకు టెండర్ పిలవలేదు.
- వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు వద్ద ట్యాంకుబండ్ ఆనకట్ట పనులు, చెరువు పూడికతీత పనులు చురుకుగా సాగుతున్నాయి.
- జోగుళాంబ గద్వాల జిల్లా విషయానికి వస్తే ఇక్కడ రెండు మినీ ట్యాంక్‌బండ్లు మంజూరు చేశారు. కానీ గద్వాల పెద్ద చెరువు పనుల కోసం ఒప్పందం చేసుకోగా, అలంపూర్ పెద్ద చెరువు విషయం కోర్టులో పెండింగ్‌లో ఉంది.

బిల్లుల కోసం కొర్రీ

ఇప్పటివరకు చేసిన పనులకు కొంత కాలం ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు మిగతా పనులు చేసేందుకు ససేమిరా అన్నారు. ప్రస్తుతం కొంతమేరకు బిల్లులు చెల్లించినట్లు తెలుస్తుండగా.. మళ్లీ పనులు చేస్తున్నారు. ఏది ఏమైనా జూన్ నెలాఖరు నాటికి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ట్యాంకు బండ్లు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం, అధికారులు ముందుకు సాగుతున్నారు.

చేయాల్సిన పనులు ఇవే...

- చెరువు ఆనకట్ట 6.25 మీటర్ల వెడల్పు
- తూములు, అలుగులు, పాటుకాల్వల మరమ్మతులు, బతుకమ్మ ఘాట్
- ఆనకట్ట రిలింగ్, రివెంట్‌మెంట్
- కట్టపై సీసీ రోడ్డు నిర్మాణం
- కట్టపైకి వెళ్లడానికి ర్యాంపు
- చుట్టూ రెండు మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్
- టూరిస్టులకు మినీ ట్యాంకుబండ్‌లో చక్కర్లు కొట్టేందుకు బోటింగ్
- ఆనకట్టపై కుర్చీలు, లైటింగ్

ట్యాంకుబండ్ నిర్మాణాలకు కేటాయించిన నిధులు

నియోజకవర్గం	నిధులు
మహబూబ్‌నగర్	రూ.4.95 కోట్లు
మక్తల్	రూ.3.68 కోట్లు
మరికల్	రూ.3.46 కోట్లు
దేవరకద్ర	రూ.3.72 కోట్లు
జడ్చర్ల	కోర్టు కేసుతో పెండింగ్‌లో ఉంది
నాగర్ కర్నూల్	రూ.4.33 కోట్లు
అచ్చంపేట	రూ.1.34 కోట్లు
కొల్లాపూర్	రూ.4.71 కోట్లు (పెండింగ్‌లో ఉంది)
వనపర్తి	రూ. 5.41 కోట్లు
గద్వాల	రూ.3.52 కోట్లు
అలంపూర్	కోర్టు కేసుతో పెండింగ్‌లో ఉంది

జూన్ చివరి నాటికి పూర్తి చేస్తాం



హుస్సేన్‌సాగర్ తరహాలోనే మినీట్యాంకుబండ్ నిర్మాణ పనులు ఉంటాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆనకట్ట వెడల్పు పనులు పూర్తయ్యే దశకు చేరాయి. మరికల్, మక్తల్, దేవరకద్ర చెరువుల వద్ద పనులు మార్చి నాటికి పూర్తవుతాయి. నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా పరిష్కరించి జూన్ చివరి వరకు ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేయాలనేది మా లక్ష్యం. ఇక కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను దశల వారీగా చెల్లిస్తున్నాం.

– ఆనంద్ సాగర్, ఎస్‌ఈ, మహబూబ్‌నగర్

బాలికలకు వరం

- 'కాస్మొటిక్' కిట్లు అందజేస్తున్న ప్రభుత్వం
- కస్తూర్బాల విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే 15 ఉత్పత్తులు
- ఉమ్మడి జిల్లాలో 11,164 మందికి లబ్ధి
- పంపిణీని ప్రారంభించిన మంత్రి లక్ష్మారెడ్డి



విద్యార్థినులకు పంపిణీ చేస్తున్న కిట్‌లోని వస్తువులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ వనపర్తి విద్యావిభాగం: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థినులకు ఉన్నత స్థాయిలో విద్య అందజేస్తున్నారు. అంతేకాకుండా ఈనెల 1వ తేదీ నుంచి విద్యార్థినులకు పౌష్టికాహారం అందేలా నూతన మెనూ అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారానికి నాలుగు సార్లు చికెన్‌తో పాటు అదనంగా రెండు వారాలు మటన్, నాలుగు రోజులు గుడ్లు, ఆరు రోజులు పండ్లు పంపిణీ చేయనున్నారు. దీనిని తోడు విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినులకు 15 వస్తువులతో కూడిన కిట్లు అందజేయనున్నారు. ఈ కిట్లు ఇప్పటికే జిల్లా కేంద్రాల్లోని డీఈఓ కార్యాలయాలకు చేరాయి. కాగా, రాజాపూర్ మండలం కుచ్చర్‌కుల్‌లో ఏర్పాటుచేసిన కేజీబీవీని బుధవారం ప్రారంభించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఈ కిట్ల పంపిణీని ప్రారంభించారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇలా..

జిల్లా	కస్తూర్బాలు	విద్యార్థుల సంఖ్య
వనపర్తి	15	2,354
జోగుళాంబ గద్వాల	12	1,840
నాగర్ కర్నూల్	20	2,520
మహబూబ్‌నగర్	26	4,450
మొత్తం	73	11,164

కిట్ ఎందుకంటే...

ఇప్పటివరకు కేజీబీవీల విద్యార్థులకు నెలకు రూ.100 చొప్పున కాస్మొటిక్ చార్జీలు చెల్లిస్తున్నారు. అయితే, ఈ డబ్బు సకాలంలో వారికి అందడం లేదు. రెండు, మూడు నెలలకోసారి ఇస్తుండడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ప్రత్యేకంగా రూ.300 విలువైన కాస్మొటిక్ వస్తువులతో కూడిన కిట్‌ను అందజేయాలని నిర్ణయించడంతో విద్యార్థినుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఏమేం ఉంటాయి...

విద్యార్థినులకు అందజేసే కిట్లలో మూడు నెలలకు సరిపడా వస్తువులు ఉంటాయి. ఇందులో టూత్‌పేస్ట్, ఒక బ్రష్, టంగ్ క్లీనర్, షాంపులు, కొబ్బరినూనె, బొట్టు బిళ్లలు, హెయిర్ బ్యాండ్లు, రిబ్బన్లు, చేతులు శుభ్రం చేసుకునే లిక్విడ్, మూడు స్నానం సబ్బులు, రెండు బట్టల సబ్బులు, దోమల నివారణ లిక్విడ్‌తో పాటు శానిటరీ న్యాప్‌కిన్ వంటి 15 రకాల వస్తువులు ఉన్నాయి. కాగా, ఈ కిట్లను బాలికలకు ప్రతీ మూడు నెలలకోసారి అందజేస్తారు.

డెంగీవ్యాధిపై వైద్యబృందం ఆరా


రక్త నమూనా సేకరిస్తున్న సిబ్బంది

నవాబుపేట (జడ్చర్ల): మండలంలోని కాకర్లపహడ్‌లో బుధవారం వైద్య బృందం పర్యటించి డెంగీ వ్యాధిపై ఆరా తీసింది. గ్రామానికి చెందిన ముస్తాఫా అనే వ్యక్తి డెంగీ వ్యాధితో మృతిచెందడంతో వైద్యులు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. బాధితుడి ఇంటి పరిసరాలతోపాటు గ్రామం మొత్తం పరిశీలించి రక్త నమూనాలు సేకరించారు. అయితే గ్రామస్థాయిలో ఏఎన్‌ఎంలు సరిగా స్పందిస్తే ముందుగానే ఈ విషయం తెలిసేదని వైద్య సిబ్బంది గ్రామస్థాయి పర్యటనలు చేయకపోవడమే ఇందుకు కారణమని ఎంపీపీ శ్రీనివాస్ ఆరోపించారు. సిబ్బంది నిర్లక్ష్యం వీడి పని చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య బృందం పరిశీలన సమయంలో ఎంపీటీసీ కమలమ్మ ఏఎన్‌ఎం గ్రామానికి రారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

కనులపండువగా రథోత్సవం

మానవపాడు (అలంపూర్): మండలంలోని బోరవెల్లిలో రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు నిండు పున్నమి వెన్నెల్లో ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం స్వామివారిని వేలాది మంది భక్తులు దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం


రథాన్ని లాగుతున్న భక్తులు

మేకలపై అడవి జంతువుల దాడి

వంగూరు (కల్వకుర్తి): మండలంలోని కోనేటిపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిగుట్టతండాలో 5 మేకలపై అడవి జంతువులు దాడి చేసినట్లు బాధితరైతు హర్యానాయక్ తెలిపారు. సోమవారం తండా సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో మేకలను మేపుతుండగా అడవి జంతువులు దాడిచేసి రెండింటిని చంపేయగా మరో మూడు మేకలను ఎత్తుకెళ్లాయన్నారు. అయితే విషయం తెలుసుకున్న స్థానిక వెటర్నరీ డాక్టర్ అజిత్‌చంద్ర ఆమనగల్లు ఫారెస్ట్ ఆఫీసర్ భాస్కర్‌లు అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మేకలపై దాడిచేసిన జంతువేదన్న విషయం తెలియరావడం లేదని అటవీ అధికారి తెలిపారు. దాడి జరిపిన సమయంలో అడవి జంతువుల అడుగులు చెరిగిపోవడం వల్ల గుర్తుపట్టలేకపోతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఫారెస్ట్ అధికారికి వివరిస్తామన్నారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.40 వేలకుపైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి బాధిత కాపరిని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

వేధింపులు తాళలేక వివాహిత బలవన్మరణం


అంజమ్మ మృతదేహం

నారాయణపేట రూరల్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. హన్వాడ మండలానికి చెందిన కొండ లక్ష్మమ్మ, పెంటయ్య దంపతుల కూతురు అనిత అలియాస్ అంజమ్మ (35)ను నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గవినోళ్ళ భగవంతుకు గత 15 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు పుట్టిన తర్వాత భార్యను అకారణంగా వేధించడం ప్రారంభించాడు. గత కొంతకాలంగా భగవంతు అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో తప్పని పెద్దల సమక్షంలో చెప్పినా వినకుండా భార్యను శారీరకంగా, మానసికంగా హింసించడం ఎక్కువ చేశాడు. దీంతో తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. విషయం గమనించి కుటుంబ సభ్యులు ముందుగా 'పేట ఆస్పత్రి, పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రంలో చికిత్సలు చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందింది. అంజమ్మ తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని యువకుడు..

కల్వకుర్తి టౌన్: మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన గొడుగు హరికృష్ణ(25) ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. అయితే ఈయన మృతికి గల పూర్తి కారణాలు తెలియలేదు. హరికృష్ణ తండ్రి నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

ఉల్లి ధరల తగ్గుముఖం

- గరిష్టంగా రూ.3,300.. కనిష్టంగా రూ.2,900
- కొత్త దిగుబడుల రాకతో దిగివచ్చిన ధరలు
- క్వింటాపై రూ.వెయ్యి వరకు తగ్గుదల


వేలం పాడుతున్న వ్యాపారులు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి. గత రెండు నెలలుగా జోరందుకున్న ఉల్లి ధరలు ప్రస్తుతం కొత్త దిగుబడులు రావడంతో ధరలలో తగ్గుదల కనిపించింది. ఇటీవల ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉల్లి దిగుబడులు తగ్గడం వల్ల ధరలు బాగా పెరిగిపోయాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉల్లి ధరలు వచ్చాయి. గత ఎనిమిది వారాలుగా ధరలు అటు ఇటు అవుతున్న ధరల ఘాటు మాత్రం తగ్గలేదు.

15 టన్నుల ఉల్లి..

బుధవారం మార్కెట్‌కు దాదాపు 15 టన్నుల ఉల్లి అమ్మకానికి వచ్చింది. అలాగే హైదరాబాద్ మలక్‌పేట, కర్నూలు, రాయిచూర్ మార్కెట్‌లలో కూడా ఉల్లి ధరలు తగ్గడంతోపాటు మహారాష్ట్ర నుంచి పెద్ద మొత్తంలో ఉల్లి దిగుబడి రావడంతో ధరలు తగ్గుముఖం పట్టినట్లు వ్యాపారులు తెలిపారు. గత కొన్ని వారాలతో పోల్చుకుంటే ఈవారం గరిష్టంగా రూ.వెయ్యి వరకు ఉల్లి ధర పడిపోయింది. గతంలో రూ.4,300 వరకు గరిష్టంగా ధరలు నమోదవగా.. బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధర గరిష్టంగా రూ.3,300, కనిష్టంగా రూ. 2900 వరకు వచ్చాయి. ఉల్లి సీజన్ ప్రారంభం కావడం వల్ల ధరలు తగ్గుతున్నాయి. మరో నెల తర్వాత ఇప్పుడు వస్తున్న ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

చిల్లరగా రూ.35..

ఉల్లి ధరలు తగ్గడం వల్ల చిల్లరగా రూ.30 నుంచి రూ.35 వరకు కిలో విక్రయించారు. గతంలో రూ.40 నుంచి రూ.50 వరకు ఉన్న ఉల్లి ధర తగ్గడంతో ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. ఇక టమాట ధరలు సైతం పూర్తిగా పడిపోయాయి. దేవరకద్ర సంతలో కిలో టమాట రూ.5– 8 వరకు విక్రయించారు. ఉల్లి ధరలు పెరిగినప్పుడు టమాట ధరలు పడిపోతాయని, టమాట ధర పెరిగితే.. ఉల్లి ధరలు తగ్గుతాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఆముదాల ధర రూ.4,019 ..

స్థానిక మార్కెట్‌లో బుధవారం జరిగిన ఈనామ్ టెండర్‌లలో ఆముదాల ధర గరిష్టంగా రూ.4,019గా వచ్చాయి. కనిష్టంగా రూ. 4,018గా నమోదయ్యాయి. కందులు గరిష్టంగా రూ.4,759, కనిష్టంగా రూ.4,535గా వచ్చాయి. కందులు వంద క్వింటాళ్ల వరకు రాగా.. ఆముదాలు పది క్వింటాళ్ల వరకు అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు వారం రోజులుగా వరిధాన్యం రాక పూర్తిగా నిలిచిపోయింది.

శ్రీశైలంలో 869.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట (అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రం వరకు 869.7 అడుగుల వద్ద 140.3100 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం ఎగువన పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు 2 వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 2,363, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 440, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో 24 గంటల వ్యవధిలో పంప్‌మోడ్ పద్ధతిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి 3,358 క్యూసెక్కుల నీటిని తరలించారు. దీనికి 2.212 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు.

చిరిగిపోయాయ్!

✦ పింఛన్ల పంపిణీలో చిరిగిన నోట్లు
✦ తీసుకోవడానికి వృద్ధుల నిరాకరణ

మరికల్ (నారాయణపేట): పింఛన్‌దారులకు ప్రభుత్వం అందిస్తున్న 'ఆసరా' పథకం చినిగింది. ఈ పథకం కింద నెలనెలకు ఇస్తున్న రూ.వెయ్యి పింఛన్‌లో అధికంగా రూ.10, 20 నోట్లు చినిగిపోయి ఉన్నాయి. ముందుగా వీటిని తీసుకున్న పింఛన్‌దారులు మార్చుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నోట్లను వ్యాపారులు, కిరాణదుకాణదారులు తీసుకోవడం లేదు. వీరి ఇబ్బందులను చూసిన మరికొందరు వాటిని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. బ్యాంకులో సైతం తీసుకోకపోవడం,


వెంకటాపూర్‌లో చిరిగిన నోట్లను చూపుతున్న వృద్ధులు

చినిగిన నోట్లను తీసుకుని మంచినోట్లు ఇవ్వాలని పోస్టాఫీస్ అధికారులను వేడుకోగా వారు సైతం తీసుకుంటే తీసుకోండి.. లేకుంటే లేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


చినిగిపోయిన రూ.10 నోట్లు


రూ.20 నోటు దుస్థితి ఇలా..

ఉత్సాహంగా అథ్లెటిక్స్

✦ 14 బీసీ విద్యార్థి వసతి గృహాల క్రీడాకారులు హాజరు
✦ విజేతలకు ట్రోఫీలు అందజేసిన ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు

స్పోర్ట్స్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన బీసీ విద్యార్థి వసతి గృహ క్రీడలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో జిల్లాలోని 14 వసతి గృహాల బాల, బాలికలు పాల్గొనగా.. వీరికి కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉదయం క్రీడా పోటీలను జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఓడినవారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి విద్యాసాగర్, సహాయ అధికారులు నిర్మల, కృష్ణమాచారి, పీడీ పాపిరెడ్డి, పీఈటీలు రామేశ్వర్, నిరంజన్‌రావు, మేరిపుష్ప, ఉమాదేవి, జ్యోతి, మొగులాల్‌తోపాటు ఆయా వసతి గృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి విద్యాసాగర్


బాలికల ఖోఖో విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ

ఫలితాల వివరాలు..

కబడ్డీ (బాలురు) పేరూరు, సీసీకుంట, ఖోఖో గండీడ్, కోస్గి (బాలికలు) మద్దూరు, ధర్మాపూర్, మహబూనగర్, ధర్మాపూర్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అథ్లెటిక్స్ బాలురలో షాట్‌పుట్ సందీప్ (పేరూరు), 100 మీ, 200 మీ, 400 మీ వెంకటేశ్ (పేరూరు), శివశంకర్ (పేరూరు), స్కిప్పింగ్ రోప్‌లో శారద, స్వాతి (మహబూబ్‌నగర్), రాధిక (నారాయణపేట), 100 మీ– లక్ష్మి (మద్దూరు), 200 మీ, షాట్‌పుట్ మౌనిక (ధర్మాపూర్), 400 మీ వెంకటేశ్వరి (ధర్మాపూర్) మొదటి స్థానాలను కైవసం చేసుకున్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

కోచ్‌ల సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రికి స్వీట్ అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ అథారిటీ పరిధిలో పనిచేసే కాంట్రాక్ట్ కోచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాట్ రాష్ట్ర కాంట్రాక్ట్ కోచ్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో క్రీడాశాఖ మంత్రి పద్మారావును కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంత్రికి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాట్ ఎండీ దినకర్ బాబుతోపాటు ఇతర ఉన్నతాధికారులను కలిసి పూలబొకేలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంట్రాక్ట్ కోచ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టీవీఎల్ సత్యవాణి, గోకుల్, సంయుక్త కార్యదర్శులు నర్సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

5న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

గద్వాల రూరల్: మండలంలోని ఈడిగోనిపల్లిలో ఈదమ్మ జాతర, సంక్రాంతి పండగను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేష్, రాముడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు గురువారం సాయంత్రంలోగా ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 9550813138, 9603706548లలో సంప్రదించాలని వారు కోరారు.

11న జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

జడ్చర్ల టౌన్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ నుంచి రెండు రోజుల పాటు రాజాపూర్ మండలం పల్లుగడ్డ తండాలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు తెలిపారు. జిల్లా వాలీబాల్ అకాడమీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం జడ్చర్లలో విద్యాధర్ అకాడమీ నిర్వాహకులు విద్యాధర్ ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు శుక్రవారం సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సభ్యులు కోరారు.

విద్యార్థులకు అభినందనలు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు తదితరులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి నాలుగో సబ్ జూనియర్ పోటీలకు ఎంపికయ్యారు. రెండు మాసాల క్రితం అచ్చంపేటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చడంతో 8 మంది విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని జీహెచ్‌ఎం వివేకానంద తెలిపారు. షాట్‌పుట్ విభాగంలో సాజిద్, అశ్విని, అండర్–12 లాంగ్‌జంప్ విభాగంలో సాయిరాం, కల్యాణం శివకుమార్, అండర్–14 లాంగ్‌జంప్‌లో వాసవీ, హైజంప్‌లో మహేశ్, అండర్–12లో 60 మీటర్ల రన్నింగ్‌లో అర్హత సాధించారు. వీరు ఈ నెల 8, 9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఎం వివేకానంద, వ్యాయామ ఉపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, సర్పంచ్ కృష్ణయ్య, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎల్లమమ్మ తదితరులు అభినందించారు.

ఉసూరుమంటున్న ఉపాధి

- లక్ష్యం నెరవేరని ఉపాధి హామీ పథకం
- అర్హులకు పని కల్పించడంలో అధికారుల విఫలం

బిజినేపల్లిరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక లక్ష్యం నెరవేర కుండా పోతుంది. అర్హులకు పని కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతుండగా ప్రతి ఏడాది వారి సంఖ్య క్రమేపి తగ్గుతోంది. మండల పరిధిలోని గ్రామాల్లో నుంచి వలసలు నివారించి వారికి గ్రామాల్లోనే ఉపాధిని అందించడానికి ఈ పథకాన్ని ఉపయోగించుకోవాల్సి ఉండగా అర్హత గల వారికి పనులు అందకపోవడంతో వలసలు తప్పడం లేదు.

ఎస్సీ, ఎస్టీలలో ప్రాధాన్యం కరువు..

ఉపాధి పథకంలో బలహీన వర్గాలలో 60 శాతంపైగా ఉపాధిహామీ పనులను అధికారులు కల్పిస్తున్నారు. కాని ఎస్సీ, ఎస్టీలకు మైనార్టీ వర్గాల వారికి అంతగా పనులను కల్పించలేకపోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంటుంది. జాబ్ కార్డులు ఉన్నా వారికి పనులు అందని పరిస్థితి నెలకొంది. అందులో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదిశాతం మందికి కూడా ఉపాధి పనులు దొరకడం లేదు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 10వేల 533 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో కేవలం 202 మందికి మాత్రమే వంద రోజుల పని దినాలను కల్పించారు. కానీ అందులో ఏడు శాతం కూలీలకు పనులు అందించకపోవడంతో ఉపాధి ఉసూరుమంటోంది.

తగ్గుతున్న ఆసక్తి...

అధికారులు సకాలంలో కూలీలకు పనులు కల్పించకపోవడంతో ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది ఇదే సమయంలో 37వేల 45 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరు కాగా ఈ సంవత్సరం 23 వేల 396 మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారు. దీంతోపాటు పని కి వచ్చిన కూలీలకు డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల్లో కూలీలకు డబ్బులు చెల్లించాలని ఆదేశాలు ఉన్నా అందులో కేవలంమూడుశాతం కూలీలకే డబ్బులు అందుతున్నాయి. రోజుకు ఉపాధి కూలీలకు రూ.189 ఇవ్వాల్సి ఉన్నా వారికి రూ.147 మాత్రమే కూలీలకు ఇస్తున్నారు. ఈ కారణాలతో కూడా ఉపాధి పనులపై కూలీల ఆసక్తి తగ్గుతోంది.



వెల్గొండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలంలో మూడేళ్లలో ఉపాధి హామీ పథకం వివరాలు

	2015-16	2016-17	2017-18
జాబ్ కార్డులు	19,308	16,333	10,533
శ్రమశక్తి సంఘాలు	920	810	750
ఉపాధిహామీ కూలీలు	44,674	37,045	23,396
ఉపాధి పనులకు వ్యయం	రూ.5,18,452.24	6,04,547.15	5,86,504.15

ఉపాధి కూలి చాలడం లేదు..



ఉపాధిహామీ పథకం ద్వారా అరకొరగా ఇస్తున్న రూ.189 ఇప్పటి ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చే కూలీలకు కూడా అరకొరగా సాకులు చెబుతూ కోతలు పెడుతోంది. ఉపాధిహామీ పథకం కంటే వేరే కూలీకి పోతే రూ.350 నుంచి 400 వస్తున్నాయి. పని కూడా ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. *– గంగయ్య, ఖానాపూర్*

ప్రతిఒక్కరికీ కూలీ కల్పిస్తున్నాం



జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి గ్రామాల్లో ఉపాధి హామీలో కూలి కల్పిస్తున్నాం. కానీ చాలా మంది ఉపాధి హామీ పథకం కూలీకి రావడం లేదు. డబ్బులు రావడం ఆలస్యమైనా ఖచ్చితంగా అందరికీ చెల్లిస్తున్నాం. గ్రామాల్లో కూలీలకు పని కల్పించని సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం. *– ఏపీఓ రామలింగేశ్వర్*

పూడుకుపోయిన నీటితొట్టి



కార్కొండలో మట్టితో పూడుకుపోయిన నీటితొట్టి

బిజినేపల్లిరూరల్: మండల పరిధిలోని కార్కొండలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్లు మట్టితో పూడుకుపోయాయి. వాటర్‌ట్యాంకు పక్కనే ఉన్నా పశువుల తొట్లలో మట్టి ఉండటంతో నీరు లేక పశువులు దాహంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు రైతులు తెలిపారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9493080108

న్యూస్ బాక్స్

ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తాడూరు: మండల కేంద్రం తోపాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిపనులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు ఉపాధి పనులకు సంబంధించిన ఏడు రిజిష్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుని పనులను పరిశీలించడంతోపాటు కూలీలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఈసీరవిరాజు,సాంకేతిక సహాయకుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

తాడూరు: గ్రామాభివృద్ధికి పార్టీలతో నిమిత్తం లేకుండా అందరూ కలిసి రావాలని సర్పంచ్ యారా సుజాత కోరారు. బుధవారం పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ, ఉప సర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: జిల్లాలోని తెలంగాణ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం వారి నూతన క్యాలెండర్, డెయిరీని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు చేతుల మీదుగా బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మట్లాడుతూ నూతన జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచాల్సిన అవసరం ఉందని, ప్రతి ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రాముడునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, అహ్మద్ మొహినొద్దీన్, హన్మంతునాయక్, ఎండీ బురాన్, లక్ష్మీపతి, సుదర్శన్ ఉన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్‌ఎడ్యుకేషన్/ కందనూలు: గ్రామీణ పేదప్రజలకు వైద్యం అందించడంలో 104 సిబ్బంది అత్యంత కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం పాలెంలోని డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో 104 ఉద్యోగులు, ప్రభుత్వ ఫార్మసిస్ట్ సంఘ సభ్యుల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్లి అక్కడే ఉండి వైద్య సౌకర్యం కల్పించడంలో ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాసు, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ రమేష్‌రెడ్డి, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్, సెక్రెటరీ వినోద్, ప్రభుత్వ ఫార్మసిస్ట్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, కోశాధికారి శ్రీనివాస్, డీఎంహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సుధాకర్ లాల్

ఆశాలకు శిక్షణా తరగతులు

బిజినేపల్లిరూరల్: ఆశాలకు హోం బేసిడ్ నియోనెటల్‌కేర్‌పై జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ శిక్షణ తరగతులను పాలెం పీహెచ్‌సీలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశాలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఆశాకార్యకర్త ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రసవం అనంతరం బాలింత పరిశీలన, పుట్టిన పిల్లలకు తీసుకునే జాగ్రత్తలు నవజాత శిశువులకు 0–28 రోజుల మధ్య, సంవత్సరంలోపు ఇచ్చే టీకాలపై వారికి అవగాహన కల్పించారు. జిల్లాఉప వైద్యాధికారి వెంకటదాసు, డీఎంఓ శ్రీనివాస్, డీపీహెచ్‌ఓ విజయలక్ష్మి, టీఓటీలు వరమ్మ, కుమార్ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

చెరువులకు నీరు అందించాలి



బిజినేపల్లిరూరల్: మండల పరిధిలో గంగారం గ్రామ చెరువులోకి నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కనే కేఎల్ఐ కాల్వ ఉన్నా చెరువులోకి చుక్క నీరు చేరడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి మోటార్ల ద్వారానైనా చెరువులోకి నీటిని పంపింగ్ చేయాలి. *– రవి, గంగారం*

పనులు నాణ్యతగా చేపట్టాలి



ఇంటింటికి నీటి పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్‌భగీరథ పనులను ప్రారంభించింది. కానీ గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారు. అధికారులు స్పందించి మిషన్‌భగీరథ పనులను నాణ్యతగా చేసి ప్రజలకు తాగునీటిని అందించాలి. *– చంద్రమోహన్‌రెడ్డి, శాయిన్‌పల్లి*

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరుగా వర్షం పడుతుంది. జమ్మూ, కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తేలికపాటి వాన లేదా మంచు కురిసే అవకాశం ఉంది. కేరళలోని కోస్తా ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షం కురుస్తుంది. ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్, బిహార్, అసోం, పశ్చిమబెంగాల్‌లలో మోస్తరు నుంచి దట్టమైన పొగమంచు కప్పి ఉంటుంది. ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో రోజంతా చల్లని వాతావరణం ఉంటుంది.

మహబూబ్‌నగర్ వాతావరణం

గరిష్ఠం కనిష్ఠం
31.8°/16.9°

జాతీయం

నగరం	గరిష్ఠ	కనిష్ఠ
ఢిల్లీ	18.4	07.4
కోల్‌కతా	23.8	13.7
బెంగళూరు	27.6	18.4
ముంబై	30.0	16.4
చెన్నై	30.2	22.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ఠ/ కనిష్ఠ	పట్టణం/జిల్లా	గరిష్ఠ/ కనిష్ఠ
కర్నూలు	32.3/19.7	రాజమండ్రి	30.3/19.4
అనంతపురం	32.0/17.1	తాడేపల్లిగూడెం	30.3/19.4
ఒంగోలు	31.9/22.2	వరంగల్	30.3/18.0
గుంటూరు	31.8/16.0	కాకినాడ	29.8/20.0
కడప	31.7/18.5	కరీంనగర్	29.8/12.5
నెల్లూరు	31.3/22.8	విజయవాడ	29.7/19.0
చిత్తూరు	31.2/19.3	విశాఖపట్నం	29.4/21.5
తిరుపతి	31.2/19.3	ఆదిలాబాద్	29.4/07.0
మహబూబ్‌నగర్	31.1/18.9	హైదరాబాద్	29.2/16.9
ఖమ్మం	31.0/14.2	రంగారెడ్డి	29.2/16.9
మెదక్	30.7/12.0	నల్లగొండ	29.2/15.0
నిజామాబాద్	30.4/14.9	శ్రీకాకుళం	28.0/16.0
ఏలూరు	30.3/19.4	విజయనగరం	28.0/16.0

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 మనసులో మాట
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 లక్కీ ఛాన్స్
ఉ.09.30 కూలీ
మ.12.00 శ్రీ షిర్డి సాయిబాబా మహాత్మ్యం
సా.06.00 బద్ర
రా.09.00 గగనం



మూవీస్ నౌ
ఉ.06.00 షాంఘై నూన్
ఉ.11.25 ఎంటర్ ద డ్రాగన్
మ.03.05 ఆక్టోపస్సీ
రా.07.15 జార్జ్ ఆఫ్ ద జంగిల్
రా.10.50 క్యాసినో రాయల్



హెచ్‌బీవో
ఉ.07.56 ద కరాటే కిడ్-2
మ.12.03 మ్యాన్ ఆఫ్ స్టీల్
మ.02.27 పుస్ ఇన్ బూట్స్
సా.05.53 ద డిక్టేటర్
రా.09.00 కుంగ్‌ఫు పాండా 2



స్టార్ మూవీస్
ఉ.06.55 ఏలియన్ వర్సెస్ ప్రిడేటర్
ఉ.11.15 కుంగ్‌ఫు హ్యాసిల్
మ.01.11 ఐస్ ఏజ్
సా.04.32 జుమాంజీ
రా.09.00 స్పీడ్



మా మూవీస్
ఉ.07.00 గోకులంలో సీత
మ.12.00 హ్యాపి
మ.03.00 శ్రీ
సా.06.00 అందరివాడు
రా.09.00 హలోబ్రదర్



జీ సినిమా
మ.12.23 రామయ్యా వస్తావయ్యా
మ.03.20 లింగా
సా.06.09 దేలింగ్‌బాజ్ 3
రా.09.00 శూర్‌వీర్
రా.11.49 షేర్ ఏ జిగర్



పుచ్చకు సమయమిదే..

- తక్కువ నీరున్నా సాగు చేయొచ్చు
- విత్తనాల ఎంపిక, నేలలు కీలకం
- సరైన యాజమాన్య పద్ధతులు, కొద్దిపాటి మెళకువలతో అధిక దిగుబడి
- అలంపూర్ ఏడీఏ మహ్మద్ ఖాద్రీ సలహాలు, సూచనలు



పుచ్చకాయల తోట

అలంపూర్: వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో పుచ్చ సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. సరైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, కొద్దిపాటి మెళకువలు పాటిస్తే చాలు అధిక దిగుబడులు సాధించడం ద్వారా రైతులు లాభాలు గడించవచ్చు. ఈ మేరకు పుచ్చ సాగుపై ఆసక్తి ఉన్న వారే కాకుండా ఇప్పటికే సాగు చేస్తున్న రైతుల కోసం అలంపూర్ ఏడీఏ మహ్మద్ ఖాద్రీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సాగుకు సంబంధించిన వివరాలు ఆయన మాటల్లోనే..

నేలలు, వాతావరణం..

పుచ్చకాయ పక్వానికి వచ్చినప్పుడు అధిక ఉష్ణోగ్రతలు ఉంటే మంచి రుచి, నాణ్యత వస్తుంది. 23 నుంచి 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలతో కూడిన తేమ వాతావరణం ఈ పంట సాగుకు అనుకూలం. మురుగు నీరు ఇంకిపోయే వసతి కలిగిన ఇసుక, బంక మట్టి నేలలు పుచ్చకాయ పంటకు అనుకూలం. అయితే, చౌడు, ఉప్పు నేలలు మాత్రం పనికిరావు.

రకాల ఎంపిక..

ఆర్య జ్యోతి, ఆర్య మానిక్, సుగర్ బేబి, అపర్ణ, మధుబాల, మోహిన వంటి పుచ్చకాయల రకాలు మంచివి. ఇవేకాకుండా ప్రైవేట్ సంస్థల సంకర విత్తనాలను కూడా విత్తుకోవచ్చు.

విత్తనాల అవసరం..

హైబ్రిడ్ విత్తనాలు అయితే ఎకరానికి 300 గ్రాములు, మేలు రకాలైతే ఎకరానికి 600 నుంచి వెయ్యి గ్రాముల వరకు అవసరం ఉంటుంది. జనవరి నెలలో ఈ పంట విత్తేందుకు అనుకూలమైన సమయం.

అధికారి సలహా



మహ్మద్ ఖాద్రీ
ఏడీఏ, అలంపూర్

నాటే పద్ధతి..

పంట నాటే ముందు భూమిని నాలుగైదు సార్లు బాగా దున్ని భూసారాన్ని బట్టి 8 నుంచి 10 అడుగుల దూరంలో 2 అడుగుల వెడల్పు కలిగిన నీటి కాల్వలు చేయాలి. లోపలి పక్క రెండు వైపులా రెండు అడుగుల దూరంలో విత్తనాలు వేసుకోవాలి. అయితే, విత్తనాలు విత్తే ముందు రోజు తప్ప కుండా నీరు పెట్టాలి.

నీటి తడులు ఇలా..

పంట ప్రథమ దశలో వారం రోజుల వ్యవధిలో నీటి తడి ఇవ్వాలి. తర్వాత వాతావరణం, భూమి స్వభావాన్ని బట్టి 5 నుంచి 7 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి. పూత వచ్చే సమయంలో ఆపి కొంచెం బెట్ట పరిస్థితులు కల్పించి తర్వాత నీరు అందిస్తే పూత బాగా వచ్చి ఆడ పూల శాతం పెరుగుతుంది. కాయ ఎదిగేటప్పుడు నీటి ఎద్దడి లేకుండా చూడాలి. కాయలు పక్వానికి వచ్చిన తర్వాత నీరు ఎక్కువగా ఇస్తే కాయలు పగిలే అవకాశం ఉంది.

కాయ.. కోత

పక్వానికి వచ్చిన కాయలను సాయంత్రం వేళల్లో కోసి ఉదయం రవాణా చేయాలి. కాయలను తడితే డొల్ల శబ్దం వస్తే కాయ పక్వానికి వచ్చిందని గుర్తించాలి.

సస్యరక్షణ చర్యలు..

పుచ్చకు ప్రధానంగా తామర పురుగు ఆశించి రసాన్ని పీల్చడం వలన ఆకులు ముడుచుకుంటాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఆల్టర్నేరియా మచ్చ తెగులు నివారణకు కార్బండిజం ఒక గ్రామును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం..

విత్తనాలు వేయడానికి ముందు ఎకరానికి నాలుగు టన్నుల పశువుల ఎరువు లేదా ఒక టన్ను వానపాముల ఎరువులు, 150 కిలోల సూపర్, 40 కిలోల పొటాష్, 25 కిలోల యూరియా వేయాలి. 30 రోజుల తర్వాత పైపాటుగా 25 కేజీల యూరియా, పూత, పిందె సమయాల్లో 60 కిలోల కాల్షియం అమ్మోనియం సల్ఫేట్‌ను మొక్క మొదలుకు ఇరువైపులా గోతి తీసి ఎరువులు వేసి మట్టి కప్పాలి. తీగలు పాకే సమయంలో తల తుంచి సూక్ష్మ ధాతువులు మొక్కలకు అందేలా ఎఫ్–4ను 4 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తీగలు సాగి నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

తిరుమల సమాచారం

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ చాలా తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే పరిస్థితి లేకుండా డైరెక్ట్‌గా పంపించేస్తున్నారు.

సాయింత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	– 10 ఖాళీగా ఉన్నాయి
రూ.50 గదులు	– 25 ఖాళీగా ఉన్నాయి
రూ.100 గదులు	– 55 ఖాళీగా ఉన్నాయి
రూ.500 గదులు	– 10 ఖాళీగా ఉన్నాయి
సేవలు	
సహస్ర దీపాలంకరణ	– 240 ఖాళీగా ఉన్నాయి
వసంతోత్సవం	– 150 ఖాళీగా ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం	– 200 ఖాళీగా ఉన్నాయి
గురువారం ప్రత్యేక సేవ	: తిరుప్పావడ



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
167	196



భవిష్యం

మేషం: పనులు ముందుకు సాగక నిరాశ చెందుతారు. ధనవ్యయం. అనారోగ్య సూచనలు. బంధు వర్గంతో విభేదాలు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

వృషభం: ప్రముఖుల నుంచి పిలుపు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకం. పలుకుబడి పెరుగుతుంది. వస్తులాభాలు. వృత్తి, వ్యాపారాలు సజావుగానే సాగుతాయి.



మిథునం: మిత్రులే శత్రువులుగా మారతారు. అనుకోని ఖర్చులు. ఆరోగ్యభంగం. శ్రమ తప్పదు. పనుల్లో అవరోధాలు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

కర్కాటకం: దూరప్రాంతాల నుంచి శుభవార్తలు. వాహనయోగం. భూవివాదాల పరిష్కారం. ఆస్తి విషయంలో ఒప్పందాలు. వృత్తి,వ్యాపారాలలో ముందడుగు వేస్తారు.

సింహం: పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక ఇబ్బందులు. రుణదాతల ఒత్తిడులు. మిత్రులతో వివాదాలు. వృత్తి,వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

కన్య: కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో ఆదరణ. వస్తు, వస్త్రలాభాలు. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

తుల: ఇంటర్వ్యూలలో విజయం. ఆప్తుల సలహాలు పాటిస్తారు. పాతమిత్రుల కలయిక. భూములు, వాహనాలు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూల వాతావరణం.

వృశ్చికం: రుణదాతల ఒత్తిడులు. అనుకోని ప్రయాణాలు. ఇంటాబయటా సమస్యలు. బంధువుల తాకిడి పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో చిక్కులు.

ధనుస్సు: శ్రమ తప్ప ఫలితం ఉండదు. పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. రాబడికి మించి ఖర్చులు అవుతాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

మకరం: మిత్రుల సలహాలు పాటిస్తారు. సంఘంలో గౌరవం. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. వస్తు లాభాలు. వృత్తి, వ్యాపారాలలో అనుకూలం.

కుంభం: గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. సభలు,సమావేశాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో పురోగతి.

మీనం: కొన్ని కార్యక్రమాలు హఠాత్తుగా విరమిస్తారు. శ్రమాధిక్యం. నిర్ణయాలు మార్చుకుంటారు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపారాలలో స్వల్ప లాభాలు. ఉద్యోగులకు నిరుత్సాహం.

– సింహంభట్ల సుబ్బారావు

ఖరీఫ్‌కు తుమ్మిళ్ల సాగునీరు

- పైపుల నాణ్యతపై అనుమానాలు వద్దు
- ఇప్పటికే వేగవంతంగా సాగుతున్న పనులు
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఖగేందర్



పనుల వద్ద అధికారులకు సూచనలిస్తున్న సీఈ ఖగేందర్

రాజోళి (అలంపూర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా ఆర్‌డీఎస్ ఆయకట్టు కింద సాగునీరందించేందుకు కృషి చేస్తున్నామని ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఖగేందర్ అన్నారు. బుధవారం రాజోళి మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో ఆయన ఎత్తిపోతల పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే పనుల్లో భాగంగా పంప్‌హౌస్, ఫోర్‌బే, అప్రోచ్ కెనాల్ పనులు సగం మేర పూర్తయ్యాయన్నారు. ఆయా పనులు చాలా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 3 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులకు గాను ఇప్పటికే 1.05 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తి చేశామన్నారు. పథకానికి మొదటి విడతలో 2,700 పైపులు అవసరం కాగా 1,300 పైపులు వచ్చాయన్నారు. భూసేకరణలో భాగంగా 94 ఎకరాలకు గాను 67 ఎకరాలకు పరిహారం అందించిని, 27 ఎకరాలకు త్వరలోనే అందిస్తామన్నారు.

అధికారుల పర్యవేక్షణలోనే..

ఎత్తిపోతల పథకానికి వాడుతున్న పైపుల నాణ్యత విషయంలో అనవసరంగా అపోహలు పడాల్సిన అవసరం లేదని, అధికారుల పర్యవేక్షణలోనే వాటిని తీసుకువస్తామన్నారు. పైపులను మాన్యువల్‌గా కాకుండా మిషన్లతో బయటకు తీసేటపుడు చిన్నపాటిగా సిమెంట్ పూత పోయిందని అలాంటి వాటికి అధికారుల సమక్షంలో గనేటింగ్ చేస్తున్నామన్నారు. వీటి నాణ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జూరాల నుంచి తుమ్మిళ్ల పథకానికి 132 కేవీ లైన్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలోనే తుమ్మిళ్ల రైతులకు ఇచ్చిన పరిహారమే ఎక్కువని, ఏ ప్రాజెక్టుకు కూడా ఇంత ఎక్కువ మొత్తంలో పరిహారం చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్ ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాసులు, ఏఈఈలు ఆంజనేయులు, శివరాం, కాంట్రాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోనివ్వం..

ఆర్‌డీఎస్ ఆయకట్టు కింద పంటలు ఎండిపోనివ్వమని ఎమ్మెల్యే సంపత‌కుమార్ అన్నారు. ఆర్‌డీఎస్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని తుమ్మిళ్లలో సీఈ ఖగేందర్‌ను కలవడానికి వచ్చిన రైతులతో కలిసి ఆర్‌డీఎస్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా కెనాల్ కింద సాగు చేసిన తమ పంటలు నీరు లేక ఎండిపోయేదశలో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే ఇండెంట్ పెట్టామని నీరు అందుతుందని, రైతులు అధైర్యపడ్డవద్దని సీఈ పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, నూరి, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, గంగిరెడ్డి, వీరేష్ తదితరులున్నారు.

కలెక్టర్, ఎస్పీల పర్యటన



కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

రాజోళి (అలంపూర్): తుమ్మిళ్ల గ్రామంలో జోగుళాంబ గద్వాల కలెక్టర్ రజత్‌కుమార్‌సైని, ఎస్పీ విజయ్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఈ నెల 8న నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తుమ్మిళ్లకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను వారు పరిశీలించారు. సభా ప్రాంగణం ఏర్పాటు ఇతర సదుపాయాలు ఎలా చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుమ్మిళ్లలో జరుగుతున్న పంప్‌హౌస్, అప్రోచ్ కెనాల్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పనులు జరుగుతున్నప్పుడు ఎదురవుతున్న పలు ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బాంబులు పేల్చడం వల్ల ఇళ్లు పగుళ్లు వస్తున్నాయని, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహులు, తహసీల్దార్ వరలక్ష్మి ఉన్నారు.

పుత్ర కామేష్టి యాగం పూర్తి



యాగంలో పాల్గొన్న దంపతులు



యాగం చేయిస్తున్న సత్యవీర్ స్వామిజీ

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని సువిజ్ఞాన ఆశ్రమంలో బుధవారం వ్యవస్థాపకులు ఆచార్య సత్యవీర్ స్వామీజీ ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగం నిర్వహించారు. పుష్యమాసంలో పుష్యమీ నక్షత్రంనాడు ఈ యాగం చేస్తే, యాగంలో వాడే ఔష ధాలు మంచి ఫలితాలను ఇస్తాయని ఆయ న పేర్కొన్నారు. అందుకే ఈ రోజు యాగం చేశామన్నారు. ఇందులో 45 మంది దంపతులు పాల్గొన్నారని చెప్పారు. అనంతరం వారికి యోగాసనాలు, ప్రాణాయామం అంశాలపై శిక్షణ ఇచ్చారు. యాగం నిర్వహణలో స్వామీజీతోపాటు, యోగా సిద్ధిరాములు పాల్గొన్నారు. ఇంకా వివరా లు తెలుసుకోవాలనుకుంటున్న వారు సెల్ నం. 9248828666లో సంప్రదించవచ్చని సూచించారు. యాగం మళ్లీ ఈ నెల 31న జరుగుతుందన్నారు.

అహర్నిశలు పేదల కోసం తపించిన బర్ధన్

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ



బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జీవితం మొత్తం పేదలు, కార్మికులు, కర్షకుల కోసం పరితపించిన పోరాటయోధుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో బర్ధన్ ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్మిక నాయకుడిగా, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మెరుగైన వసతుల కల్పనకు పాటుపడినట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలను ఏకం చేసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటు కోసం కృషి చేసిన మహనేత అని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌జీ, నర్సింహ, వార్ల వెంకటయ్య, వంకేశ్వరం శ్రీనివాసులు, రవీంద్రాచారి, చెన్నదాసు, ఖాజా, ధర్మాయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలది ప్రధాన భూమిక

పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజారత్నం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజారత్నం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యం బలోపేతంలో ఎన్నికలు ప్రధాన భూమిక పోషిస్తాయని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాజారత్నం అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలలో పొలిటికల్ సైన్స్‌లో 'ఎన్నికల నిర్వహణ- సవాళ్లు, ఇబ్బందులు, ప్రవర్తన' అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ అనేది ఇబ్బందులతో కూడుకున్న అంశమని, ఓటును సరిగా వినియోగించుకోవడంలో ప్రజలు విఫలమైనప్పుడు ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఓట్ల సమయంలో ముఖ్యంగా కులం, మతం భాష, ప్రాంతం, డబ్బు అనే అంశాలను ప్రాతిపదికగా చేసుకుని ఓట్లు వేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు వెంకటేష్ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేటప్పుడు పార్టీల సిద్ధాంతాలు, దేశ ప్రయోజనాలు, ప్రజాప్రతినిధుల గుణగణాలను పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు. ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి మాట్లాడుతూ ఓటర్ల సరళిలో ప్రజలను జాగురూకత చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ముగింపు కార్యక్రమాలో పీయూ రిజిస్ట్రార్ ఐ.పాండురంగారెడ్డి, జాతీయ వర్క్‌షాప్ కన్వీనర్ గౌస్, అధ్యాపకులు శ్రీపతినాయుడు, పద్మావతి, రవికుమార్, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కళాశాల బస్సు

తప్పిన ప్రమాదం, విద్యార్థులు క్షేమం



పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన ఓ బస్సు ప్రమాదవశాత్తు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. వెంటనే గమనించిన బస్సు డ్రైవర్ బ్రేక్ వేసి నెమ్మదిగా ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. జిల్లాకేంద్రం నుంచి ఉదయమే విద్యార్థులను ఎక్కించుకునేందుకు మండల పరిధిలోని నాగనూల్, గుడిపల్లి, రేవల్లి, తూడుకుర్తి మీదుగా నాగర్‌కర్నూల్‌కు తిరిగి వస్తున్న సందర్భంలో రోడ్డు గతుకులుగా ఉండడంతో బస్సు అదుపు తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న 42మంది విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. బస్సు వేగం తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పిందని విద్యార్థులు పేర్కొన్నారు.

అట్టహాసంగా క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు

అచ్చంపేట రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ అంతర్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు అచ్చంపేట జట్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. టోర్నీ తొలి మ్యాచ్‌లో అచ్చం పేట కేజీఆర్ జట్టు 9వికెట్ల తేడాతో మహబూబ్‌నగర్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 15ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. ఆజట్టు బ్యాట్స్‌మెన్ భాను (55), కేశవ్(19)లు రాణించారు. అచ్చంపేట కేజీ ఆర్ బౌలర్ సొహైల్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 95 పరుగుల విజయలక్ష్యంతో బ్యా టింగ్‌కు దిగిన అచ్చంపేట కేజీఆర్ అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. కేవలం ఆరు ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి విజయం సాధించింది. ఓపెనర్ సొహైల్ (58)అర్ధసెంచరీతో విజయంలో కీలకపాత్ర వహించగా,యశ్వంత్ (27)రాణించాడు. సొ హైల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది.

అక్రమ్‌సీసీ విజయం

రెండోమ్యాచ్‌లో అచ్చంపేట లోకల్ జట్టుపై అక్రమ్ సీసీ హైదరాబాద్ ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అక్రమ్‌సీసీ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 110పరుగులు చేసింది. సుజాత్(56), రఘు(24) రాణించారు. 111 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన అచ్చంపేట నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 6వికెట్లు కోల్పోయి 105 పరుగులు మాత్రమే చేసింది.సుజాత్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. అంతకుముందు టోర్నీ ప్రారంభోత్సవంలో నగరపంచాయతీ చైర్మన్ తులసీరాం, ఎంపీపీ పర్వతాలు, జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, నాయకులు మనోహర్, రాంబాబునాయక్, రాజేశ్వర్‌రెడ్డి, నిర్వాహకులు మంజూర్, గౌరీశంకర్, రాజు, కౌన్సిలర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

- అయ్యప్ప పడిపూజలో ఆకట్టుకునేలా మండపాలు
- నైపుణ్యం ఉట్టిపడేలా తయారీలో దిట్ట.. రవి



అయ్యప్ప దేవాలయంలో అలంకరణ చేస్తున్న రవి

పూజలో ప్రత్యేకం.. తయారీలో నైపుణ్యం

అచ్చంపేట రూరల్: నవంబర్ మొదలు జనవరి వరకు అయ్యప్ప మాల ధరించిన వారు మనకు తారస పడుతుంటారు. ఈ సమయంలో ప్రతిరోజూ ఏదో ఓ భక్తుడి ఇంట్లో లేదా ఆలయాల్లో పడిపూజలు జరుగుతుంటాయి. ఈ పూజల్లో మండపాలకు ఉన్న ప్రాధాన్యత అంతాఇంత కాదు. ఈ మండపాల తయారీలో ప్రావీణ్యత కనబరుస్తున్నారు అచ్చంపేటకు చెందిన కాకునూరి రవి.

నిర్మాణం ఇలా...

పడిపూజలో మండపాలకు 35 పెద్ద అరటి చెట్లు అవసరమవుతాయి. మండపం నిర్మాణానికి ఐదు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. అరటి చెట్లతో రకరకాల బొమ్మలు తయారు చేయడంతో పాటు, ఒక్కో చోట అక్కడి అయ్యప్ప భక్తుల కోరిక మేరకు మూడు మంటపాలను, ఐదు మంటపాలను వేస్తారు. అరటి చెట్లతో పాటు రెండు, మూడు అంగుళాల కర్ర మేకులు అవసరమవుతాయి. మండపంలో రంగురంగుల విద్యుద్దీపాలను, అందమైన రంగుల వస్త్రాలతో అలంకరిస్తారు.



అరటి మొక్కల బెరడుతో పూలు తయారు చేస్తున్న దృశ్యం

పునరావృతం కాకుండా..

అయ్యప్ప పూడి పూజకు అవసరమయ్యే మండపాలు వేయడంలో అచ్చంపేటకు చెందిన కాకునూరి రవి మంచి గుర్తింపు ఉంది. ఒకచోట వేసిన మండపం నమూనా మరో చోట కనిపించకుండా వేయడం ఈయన ప్రత్యేకత. రవి పదేళ్లుగా అచ్చంపేట పరిసర గ్రామాల్లో అరటి చెట్లతో అందమైన మండపాలను తీర్చిదిద్దుతూ పేరు సాధించారు.

సేవ చేయడం ఆనందంగా ఉంటుంది

అరటి మండపాలను ఉచితంగా వేస్తుంటాను. అయ్యప్ప సేవలో ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. నా మిత్రుడు వెంకటరమణాచారి సహకారంతో ఇప్పటి వరకు ఎన్నో మండపాలు నిర్మించాను. ఒక్కో పడిపూజ వద్ద వేర్వేరుగా నమూనాలు వేస్తుంటాను. ప్రస్తుతం అరటి మండపాల కంటే రెడీమేడ్ నిర్మాణాలపై పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. – కాకునూరి రవి





రవి రూపొందించిన మండపం

చీకటిని జ...

నేడు ప్రపంచ అంధుల దినోత్సవం

- ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్న అంధులు
- 'కళ్లు' లేకపోయినా 'అక్షర జ్ఞానం'
- ఇతరులకు దిక్సూచిగా నిలుస్తున్న దివ్యాంగులు

మహబూబ్‌నగర్ రూరల్: మానవ దేహంలో 'కళ్లు' అతి ముఖ్యమైనవి. నిత్యం ఏ పని చేయాలన్నా.. ఎక్కడికి వెళ్లాలన్నా.. కంటి చూపే ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే విటమిన్ల లోపంతో పుట్టుకతోనే అంధత్వానికి గురైన వారు కొందరు తమ దైనందిన కార్యకలాపాలను చక్కదిద్దుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అయితే, మరికొందరు మాత్రం చీకటిని చీల్చుకుని ముందుకు సాగుతూ మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక అంధుల మంచి మనస్సును చూసి వివాహమాడిన పలువురు వారికి కంటి చూపై నిలుస్తున్నారు. అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం ప్రపంచ అంధుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ఒకరికి ఒకరై..



వారిద్దరు అంధులే.. కానీ వీరి దాంపత్యాన్ని ఆ దేవుడు నిర్ణయించాడు. కళ్లు లేకున్నా జీవితాంతం ఒకరికి ఒకరై తోడుంటామని బాస చేశారు. మూడు ముళ్ల బంధంతో ఏకమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన బి.రాఘవేందర్‌రెడ్డి, షాద్‌నగర్‌కు చెందిన జి.అరుణ ఇద్దరికీ మధ్యలో కళ్లు పోయాయి. కానీ ఆత్మస్థైర్యంతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. వీరిలో రాఘవేందర్ ధర్మాపూర్ పీఎస్‌లో, అరుణ మోతీనగర్ పీఎస్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె. ఈ దంపతులు తమకు కళ్లు లేవన్న బాధను మరచిపోయి జీవన యానం సాగిస్తున్నారు.

ఒక్కటి చేసిన ప్రేమ



ఈ దంపతులను ప్రేమ ఒక్కటి చేసింది. మనస్సుతో ప్రేమించుకుని, అర్థం చేసుకుని వివాహం చేసుకున్నారు. హన్వాడ మండలం లింగన్నపల్లికి చెందిన మాధవులు మూడేళ్ల వయస్సులో తన రెండు కళ్లు కోల్పోయారు. అయినప్పటికీ ఎంతో కష్టపడి ఐఎంఏ టీపీటీ చదివాడు. ఐఓబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించాడు. ఈయన ఎల్కిచర్ల మండలం బేరంగూడెంకు చెందిన మానసను గత ఏడాది ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈమె కూడా పుట్టుక నుంచి అంధురాలే. వీరి ప్రేమకు అంధత్వం ఎప్పుడూ అడ్డురాలేదు.



ప్రతిఒక్కరు తమ...
మనస్సు ఉన్న వ...
అనుకుంటారు. క...

ఆమెకు రెండు కళ్ల...
ఉన్నాయి.. భర్తకు...
మాత్రం కళ్లు లేవు...
అయితే తన రె...
కళ్లతో భర్తక...
లోకాన్ని...
చూపిస్తో...
లోకం చ...
ఆయన జ...
పెద్ద మన...
తోడైంది...
వనపర్తికి...
లతాసుప్రి...
మక్తల్ మ...
బొందల...
చెందిన రె...
కళ్లు లేని...
జయరావ...
అసిస్టెంట్...
అందరికీ ఆ...



ఆలయం వద్ద ట్రాక్టర్లతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

...యించారు..

మనస్సును అర్థం చేసుకుని..



బాగుంటే చాలు.. వైకల్యం పెళ్లికి అడ్డు రాదని నిరూపించింది. మక్తల్ మండలం బొందల కుంటకు చెందిన దాసరి చెన్నయ్యకు అంతగా కళ్లు కనిపించవు. ఆయన ప్రస్తుతం మహబూబ్‌నగర్ రూరల్ మండలం చౌదర్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఆయన మంచి మనస్సును అర్థం చేసుకున్న వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వరలక్ష్మి వివాహం ఆడింది.

...ం కన్నా అందమైన, మంచి ...వారిని వివాహం చేసుకోవాలని ...కానీ ఆమె మాత్రం మనస్సు

ఆమె కళ్లే ఆయనకు లోకం



...ల్లి ... ...ెండు ...కు ...ంది. ...డని ...మ్మకు ...స్సై ... ఆమె ...చెందిన ...య. ...ండలం ...కుంటకు ...ెండు ...జయరాములును నెల క్రితం వివాహం చేసుకుంది. ప్రస్తుతం ...ములు వనపర్తి జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జూనియర్ ...గా పని చేస్తున్నారు. వీరిద్దరు ఎంతో అన్యోన్యంగా ఉంటూ ...దర్శంగా నిలుస్తున్నారు.



బ్రెయిలీ లిపి ద్వారా అంధులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- 12మందితో ప్రారంభమైన ఆశ్రమ పాఠశాల
- ప్రస్తుతం 80 మందికి ఆశ్రయం
- ఇక్కడ చదువుకున్న వారిలో పలువురు ఉన్నత స్థాయికి..
- అధ్యాపకులను నియమిస్తే మరింత అభివృద్ధి

అంధులకు అండ

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అంధుల ఆశ్రమ పాఠశాల అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. 1987 సంవత్సరంలో 12 మందితో ఈ పాఠశాల ప్రారంభమైంది. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ చదువుకున్న ఎందరో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం.

అధ్యాపకులను నియమిస్తే..

అంధుల ఆశ్రమ పాఠశాల 12 మందితో ప్రారంభం కాగా.. ఇప్పుడు 80 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే, పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసినా అధ్యాపకులను నియమించలేదు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులే అధ్యాపకులుగా వ్యవహరిస్తూ అంధులకు విద్యాబోధన చేస్తున్నారు. అధ్యాపకులను కూడా నియమిస్తే ప్రస్తుతం ఆ పాఠశాలలో నివాసముంటున్న అంధులు మరింత అభివృద్ధి సాధిస్తారని చెప్పొచ్చు.



మహబూబ్‌నగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాల


బ్రెయిలీ లిపితో బోధన

ఎలాంటి అండదండలు లేకుండా గడుపుతున్న అంధుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ ఆశ్రమ పాఠశాల దోహదం చేస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన బ్రెయిలీ లిపి ద్వారా ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. సహజంగా చురుకుగా ఉండే అంధులు ఎంతో ఓర్పు.. నేర్పుతో విద్యాభ్యాసం చేస్తూ తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన చాలామంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు సాధించి మిగతా వారి కంటే తామేం తక్కువ నిరూపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 80 మంది అంధులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



బ్రెయిలీ లిపి అభ్యసిస్తున్న విద్యార్థిని

పాఠశాల ఆవరణలోని లూయిస్ బ్రెయిలీ విగ్రహం →




శ్రమ పడితే సాధించలేనిది ఏదీ లేదు



లూయిస్ బ్రెయిలీ లిపి ద్వారా గౌరవ ప్రదమైన స్థాయికి అంధులు ఎదుగుతున్నారు. ఆధునిక యుగంలో కంప్యూటర్ వ్యవస్థను కూడా అంధులకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రతీ విషయంలో శ్రమ పడితే సాధించదంటూ ఏమీ లేదు. దేనినైనా కృషితో సాధించాలి.

– రాములు, ప్రిన్సిపాల్, అంధుల ఆశ్రమ పాఠశాల



అహో... శకటోత్సవం

ఋూలానగర్ మండల పరిధిలోని పెద్దరేవళ్లి గ్రామంలో శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం శకటోత్సవం నిర్వహ/ ంచారు. వివిధ గ్రామాల ప్రజలు గొర్రె పొట్టేళ్లు, ఎడ్ల బండ్ల రథాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఇంకా ఆటోలు, ట్రాక్టర్లు, లారీల్లో సైతం భక్తులు తరలివచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు.

జాతరకు వేలాదిగా భక్తులు హాజరుకాగా, తినుబండారాలు, ఆటవస్తువుల దుకాణాలు పెద్దసంఖ్యలో ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ చైర్మన్ సాదు వెంకట్‌రెడ్డి, సర్పంచ్ మాధవి రఘుమారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, జెడ్పీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

– బాలానగర్(జడ్చర్ల)



జాతరకు భక్తులు తీసుకొచ్చిన పొట్టేళ్ల బండ్లు



శకటోత్సవానికి ముస్తాబైన ఎద్దుల బండ్లు

ప్రభుత్వ వైఫల్యాలపై అధ్యయనం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సాగర్

దామరగిద్ద: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు 2నుంచి 10వ తేదీ వరకు టీమాస్ ఆధ్వర్యంలో గ్రామాల్లోని సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు టీ మాస్ రాష్ట్ర కార్యదర్శి సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాల్లో రిలే దీక్షలు చేపడతామన్నారు. 22న కలెక్టరేట్ ముట్టడి చేపడతామని చెప్పారు. ప్రభుత్వం దళితులకు భూ పంపిణీ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు వంటి వాటిలో పూర్తిగా విఫలమైందన్నారు. టీ మాస్ మండల నాయకులు గోపాల్, గజలప్ప, నరేందర్, వెంకటప్ప పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సూర్యం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలలో పని చేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో స్కీం వర్కర్ల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వివిధ స్కీంలకు స్వస్తి పలకాలని బడ్జెట్‌ను 60శాతం తగ్గించిందన్నారు. రాష్ట్రంలో 40శాతం బడ్జెట్‌ను స్కీంలకు స్వస్తి పలకాలని ప్రయత్నిస్తుందన్నారు. దీనివల్ల ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, వీఓఏ, ఉపాధి సిబ్బంది ఆరోగ్యమిత్ర, రైతుమిత్ర, ఎఫ్‌ఏలు, సాక్షరభారతి, రాజీవ్ విద్యామిషన్ వంటి స్కీం వర్కర్లు వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వీరి సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 17న సమ్మెకు పిలుపునిచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంమోహన్, కురుమూర్తి, వెంకటేశ్, అంబదాస్, బాగ్యమ్మ, వెంకటమ్మ, కవిత, యాదమ్మ, రామలు, రమేష్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలందరికీ ఉపాధి అవకాశాలు

- అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు
- మౌలిక వసతులపై రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ సైదయ్య ఆరా



మాట్లాడుతున్న డీఐజీ సైదయ్య

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ : క్షణికావేశంలో నేరం చేసి జైలుశిక్ష అనుభవించిన ఖైదీలు సత్ప్రవర్తన, నిరక్షరాస్యులుగా ఉన్న వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, యోగా, మెడిటేషన్ వంటివి నేర్పించడంతోపాటు విడుదల అయిన తర్వాత కూడా వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జైళ్లశాఖ ప్రత్యేక చొరవ చూపుతోందని రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ సైదయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సబ్‌జైలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా సబ్‌జైళ్ల తనిఖీలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. జైలులోని ప్రతి ఖైదీ వివరాలు తెలుసుకున్నారు. వా రికి అందాల్సిన సంక్షేమ పథకాలు, భోజన వసతులు, విద్యాదాన్ యో జన కింద చదువు రాని వారికి చదువు నేర్పుతున్నారన్నారు. అంతకు ముందు ఆయనకు జైలర్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

కాంగ్రెస్‌కు ఏడు సీట్లే ఎక్కువ!



బాదేపల్లి మార్కెట్‌లో నామ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏడుసీట్లు గెలుచుకునే పరిస్థితి కూడా లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. కానీ 70సీట్లు వస్తాయంటూ ఆ పార్టీ నాయకులు గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల మిడ్జిల్‌లో కాంగ్రెస్ నిర్వహించిన సభలో తమ పార్టీలో చేరాలంటూ ఊరూరా తిరిగి బతిమిలాడారని, ఒక్కరు కూడా చేరకపోవడం గమనార్హమని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నామ్ భవనాన్ని ప్రారంభించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ శోభ, జెడ్పీటీసీ జయప్రద, ఎంపీపీ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, గోవర్ధన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



కుచ్చర్‌కల్‌లో నూతన కేజీబీవీ వద్ద మంత్రి, డీఈఓ

రాజాపూర్(జడ్చర్ల): టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి, కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తోందని తెలిపారు. బుధవారం కుచ్చర్‌కల్‌లో ఏర్పాటు చేసిన కస్తుర్బాగాంధీ ఇంగ్లిష్ మీడియం బాలికల విద్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సావిత్రిబాయిపూలే 187వ జయంతి సందర్భంగా పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు మన ఆరోగ్యం, పరిశుభ్రత కిట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డీఈఓ సోమిరెడ్డి, ఎంపీపీ భాగ్యమ్మ, డీసీడీఓ అస్రాఖాద్రి, సర్పంచ్ యాదగిరి, తహసీల్దార్ నర్సింగ్‌రావ్, ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సుగుణ, బచ్చిరెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, ఆనంద్, లక్ష్మణ్, వాల్యా, వెంకట్‌నాయక్, వెంకట్‌చారి, లవకుమార్, ముస్తఫా, అల్తాఫ్, కిషన్‌జీ, శ్రీశైలం, లింగూనాయక్ పాల్గొన్నారు.

ప్రతీ పంటకు మద్దతు ధర

- అదే ప్రభుత్వం ధ్యేయం
- జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ భాస్కర్

గద్వాల వ్యవసాయం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్ అన్నారు. బుధవారం గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ సహకారంతో, హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను సీఎం కేసీఆర్ ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారని, అనేక పథకాలు, రాయితీలు ప్రవేశపెడుతూ అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి పంటకు కనీస మద్దతు ధర పొందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా కందికి రూ.5450 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు కందులను దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. ఎంపీపీ సుభాన్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ నజీర్, గట్టుతిమ్మప్ప, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్ప, హాకా అధికారి సురెందర్‌రెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఖాతాలను 25లోగా ఆన్‌లైన్ చేయించుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే ఉద్యోగులు 2016–17 సం వత్సరానికి గానూ తమ జీపీఎఫ్ ఖాతాలను ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ కొమర య్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సెక్షన్ అధికారిని సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

మహబూబ్‌నగర్ రూరల్: అంధుల కోసం ప్రత్యేక లిపిని సృష్టించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమశాఖ మహబూబ్‌నగర్ జిల్లా అధికారి జి.శంకరాచారి తెలిపారు. స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కలెక్టర్ రొనాల్డ్ రోస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి కంటి వైద్యశిబిరాలు

పాలమూరు: రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన గురువారం నుంచి 30వ తేదీ వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం కుల్కచర్ల, 5న శాం తినగర్, 8న ఆత్మకూర్, 9న మక్తల్, 17న నాగర్‌కర్నూల్, కోయిల్‌కొండ, 18న మద్దూర్, 19న మహబూబ్‌నగర్, 22న ఆమనగల్లు, 23న గద్వాల, 24న కల్వకుర్తి, 25న ఐజ, 29న అచ్చంపేట, 30న పెబ్బేర్, కొండగల్‌లో వైద్య శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోటార్లు నడిపితే లోపాలు తెలుస్తాయ్..

- మంత్రి జూపల్లి స్వలాభం కోసమే పనుల్లో మార్పులు
- బీజేపీ జాతీయ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్: కేఎల్‌ఐ పథకంలోని ఐదు మోటార్లను నడిపి ట్రయల్ రన్‌చేస్తే కాలువల సామర్థ్యమేంటో తెలిసిపోతుందని బీజేపీ జాతీయ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, స్వలాభం కోసమే టెండర్లలో ఉన్న కాలువల సామర్థ్యాన్ని తగ్గించి కాంట్రాక్టర్ల వద్ద డబ్బు దండుకున్నారని విమర్శించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని టీఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి మందగించిందని ఎద్దేవా చేశారు. కేఎల్‌ఐలోని ఐదు మోటార్లు ఆన్‌చేసి ట్రయల్ రన్ నిర్వహించి కాలువల సామర్థ్యం పరిశీలించకుండానే లైనింగ్ చేపడుతున్నారని అన్నారు. కేఎల్‌ఐ ఐదు మోటార్లు ఆన్‌చేస్తే 5వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలా వస్తే కాలువలు ఎక్కడికక్కడ తెగిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

జిల్లా రైతులకు నష్టం

పాలమూరు – రంగారెడ్డి పథకంలో నిర్మిస్తున్న రిజర్వాయర్లలో జిల్లా ప్రజలు భూమి ఎక్కువగా నష్టపోతున్నారని, ఆయకట్టు తక్కువగా ఉందని నాగం అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 36లక్షల ఎకరాలకు నీరందించిన తర్వాతనే నల్లగొండకు తరలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, నాయకులు చేస్తున్న అవినీతిపై పోరాడి వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో టీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా దక్కకుండా చేస్తామన్నారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ జె.రాంచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాములు, కౌన్సిలర్ నరేందర్, సర్పంచ్ పావని, బీజేపీ నాయకులు రవి, కాశన్న, యాదయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



'స్వచ్ఛత'పై సర్వే

రాష్ట్రంలో పర్యటించనున్న కేంద్ర బృందం

మున్సిపాలిటీల్లో స్వచ్ఛ భారత్ కింద చేపడుతున్న కార్యక్రమాల ఆధారంగా ర్యాంకులు ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించింది. మెరుగైన ర్యాంకు సాధిస్తే కేంద్రం చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం'లో చోటు కల్పిస్తారు. జనవరి 4వ తేదీ నుంచి దేశంలోని అన్ని మున్సిపాలిటీలను కేంద్ర బృందాలు పరిశీలించి ర్యాంకులివ్వనున్నాయి. తెలంగాణలో పర్యటించనున్న బృందం 73 మున్సిపాలిటీల్లో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించనుంది.

– వికారాబాద్ నుంచి కొలను దివాకర్‌రెడ్డి

వచ్చేస్తోంది కేంద్ర బృందం..

గతంలో లక్ష జనాభాకుపైగా ఉన్న మున్సిపాలిటీలకే సర్వేక్షణ్ పథకాన్ని పరిమితం చేయాలని భావించారు. కానీ ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ జనవరి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అమలులోకి వచ్చింది. దేశంలో మొత్తం 4,041 మున్సిపాలిటీలను కేంద్ర అధికారుల బృందం పరిశీలించనుంది. తెలంగాణలో 73 మున్సిపాలిటీలను పరిశీలించనున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. పనితీరు మెరుగ్గా కన్పిస్తేనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చోటు లభించనుంది.

కేంద్రం పర్యటించే మున్సిపాలిటీలు

గ్రేటర్ హైదరాబాద్, ఆదిలాబాద్, భూపాలపల్లి, జనగామ, కాగజ్‌నగర్, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్, వరంగల్ అర్బన్, వనపర్తి, యాదాద్రి భువనగిరి మున్సిపాలిటీలతో పాటు గద్వాల జిల్లాలో రెండు, జగిత్యాలలో నాలుగు, కరీంనగర్ జిల్లాలో మూడు, ఖమ్మం జిల్లాలో మూడు, కొత్తగూడెం జిల్లాలో నాలుగు, మంచిర్యాలలో మూడు, మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు, మేడ్చల్‌లో మూడు, నిర్మల్‌లో రెండు, నాగర్‌కర్నూలు జిల్లాలో నాలుగు, నల్లగొండ జిల్లాలో మూడు, నిజామాబాద్ జిల్లాలో మూడు, పెద్దపల్లిలో రెండు, రంగారెడ్డి జిల్లాలో ఏడు, సిరిసిల్లలో రెండు, సిద్దిపేటలో నాలుగు, సంగారెడ్డిలో ఐదు, సూర్యాపేటలో మూడు, వికారాబాద్‌లో రెండు మున్సిపాలిటీలను కేంద్ర బృందం పరిశీలించనుంది.

స్వచ్ఛత సాధిస్తే నిధులు..

స్వచ్ఛత సాధిస్తే మున్సిపాలిటీలకు దండిగా నిధులను విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలో జాతీయ స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ 18వ ర్యాంకు, వరంగల్ మున్సిపాలిటీ 33వ ర్యాంకు సాధించాయి. ఇదే విధంగా లక్షలోపు జనాభా ఉన్న మున్సిపాలిటీలను స్వచ్ఛ సర్వేక్షణకు ఎంపిక చేస్తారు. దీంతో ఆ మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య, స్వచ్ఛత పనులు, ప్లాస్టిక్ నిషేధం తదితర పనులను బట్టి ర్యాంకులను ప్రకటిస్తారు. అనంతరం నిధులను విడుదల చేస్తారు.

ఊపందుకున్న పనులు..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు పక్షం రోజులుగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. చెత్త తొలగింపుతోపాటు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో మొత్తం 15 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తారు. ఒక్కో మున్సిపాలిటీకి 4000 మార్కులను కేటాయించారు. 1400 మార్కులు పారిశుద్ధ్యం, 1400 మార్కులు పౌర సేవలు, 1200 మార్కులు రికార్డుల నిర్వహణకు కేటాయించారు.

పరిశీలించే అంశాలు..

మున్సిపాలిటీలలో తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా.., వాణిజ్య ప్రాంతాల నుంచి చెత్తను సేకరిస్తున్నారా.., చెత్త నుంచి కంపోస్టు తయారీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా.., పాఠశాలల్లో స్వచ్ఛత కమిటీల పరిస్థితి, బహిరంగ మల, మూత్ర విసర్జన వంటి అంశాలను కేంద్ర బృందం పరిశీలిస్తుంది. పరిశుభ్రత సందేశాల ఏర్పాటు, వ్యర్థాల శుద్ధి, ప్రతి 500 మీ.లకు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, పెట్రోల్ బంకుల్లో టాయిలెట్ల ఏర్పాటు తదితర అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటారు.

ఉపాధి 'కల్పన'




- ఎంప్లాయ్‌మెంట్ కార్డుపై నిరుద్యోగుల నిరాసక్తి
- యేటేటా తగ్గిపోతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య
- రెన్యూవల్ చేసుకోకపోవడంతో లక్షల్లో రిజిస్ట్రేషన్లు తొలగింపు
- ల్యాప్స్ కార్డుల పునరుద్ధరణకు ముగిసిన గడువు

ఆదిలాబాద్ నుంచి గొడిసెల కృష్ణకాంత్ గౌడ్ :


నోటిఫికేషన్లు లేవు.. కాల్ లెటర్లు రావు.. ఎంప్లాయ్‌మెంట్ కార్డుతో ప్రయోజనం లేదన్న నిరాసక్తత నిరుద్యోగుల్లో కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ శాఖ 'ఉత్తదే' అన్న అభిప్రాయం నిరుద్యోగుల్లో నెలకొంది. కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఇప్పటివరకు లక్షల్లో రిజిస్ట్రేషన్లను తొలగించారు. ప్రభుత్వం 2000 సంవత్సరం నుంచి ల్యాప్స్ అయిన కార్డుల పునరుద్ధరణకు గత నెల 31 వరకు అవకాశం ఇచ్చింది. అయినా చాలా మంది పునరుద్ధరించుకోలేదు. మొత్తంగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ వ్యవస్థపై నమ్మకం సడలుతోంది.

జిల్లాకో ఉపాధి కల్పన శాఖ..

పాత జిల్లాల్లో ఒకట్రెండు ఉపాధి కల్పన శాఖ కార్యాలయాలుండేవి. జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో నిరుద్యోగుల సమాచారం నిక్షిప్తం చేసేవారు. ఏజెన్సీ, ఐటీడీఏ ప్రాంతాల్లో ఉపాధి కల్పన శాఖ కార్యాలయాలు ఇప్పటికీ పని చేస్తున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ప్రతి జిల్లాకు ఒక కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొత్త రిజిస్ట్రేషన్లతో పాటు రెన్యూవల్స్ ప్రక్రియ జరుగుతోంది. రెండు, మూడేళ్ల కోర్సులు చేసినవారు జిల్లా శాఖలో, నాలుగేళ్ల పైబడి కోర్సులు చేసిన వారు హైదరాబాద్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేసుకోవాలి. సింగరేణి ఉద్యోగాల నియామకాలు, వారసత్వ ఉద్యోగాలకూ ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ కార్డును పరిగణనలోకి తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇతర ఉద్యోగాలకూ ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే తప్ప రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగే అవకాశం లేదు.



గత మూడేళ్లుగా లాప్స్ అయిన రిజిస్ట్రేషన్లు..



నామమాత్రంగా ప్లేస్‌మెంట్లు..

ఉపాధి కల్పన శాఖ ద్వారా ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ప్లేస్‌మెంట్ల కోసం సెప్టెంబర్ వరకు 2107 నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఒక్క పోస్టుకు 1:20 చొప్పున 14,081 మంది నిరుద్యోగుల జాబితాను పంపించగా 158 మందికే ఉద్యోగావకాశాలు దక్కాయి. 2016లో 888 మందికి, 2015లో 503 మందికి ఉద్యోగాలొచ్చాయి. ఇంతకు ముందు 10వ తరగతి కాగానే ఎంప్లాయ్‌మెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ఆ తర్వాత విద్యార్హతలు పెరిగిన కొద్దీ ఆ కార్డులో నమోదు చేసుకోవడం, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గడువు ముగియక ముందే రెన్యూవల్ చేసుకోవడం జరిగేది. అప్పట్లో పలు ఉద్యోగాల నోటిఫికేషన్లు ఎంప్లాయ్‌మెంట్ శాఖ ద్వారానే వచ్చేవి. ఇప్పుడు నోటిఫికేషన్ల సమాచారం, కాల్ లెటర్లు లేకపోవడంతో పరిస్థితులు మారిపోయాయి. మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతుండడంతో ఈ ప్రక్రియను ఎవరూ పట్టించుకోవడం లేదు.





నాగర్‌కర్నూల్‌లో

రవి: ఎంసీఏ

రమణ: ఒక్కడు మిగిలాడు

రామకృష్ణ: నేను నాప్రేమ కథ



టీ-మాస్ యాత్రను విజయవంతం చేయాలి

తెలకపల్లి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రాష్ట్ర ప్రజలు బతుకులు మారుతాయని పేదలు ఆశపడ్డారని, సీఎం కేసీఆర్ పేదలనుఆదుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారని టీమాస్ ఫోరం జిల్లా కో కన్వీనర్ గోపాస్ లక్ష్మణ్ విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని లక్నారంలో టీమాస్ ఫోరం సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల పదో తేదీ వరకు చేపడుతున్న అధ్యయన యాత్రను విజయవంతం చేయాలన్నారు. లక్నారంలో పర్యటించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీమాస్ ఫోరం గ్రామ కమిటీ చైర్మన్‌గా ఆవంచ సలేశ్వరం, కన్వీనర్‌గా మన్నె వెంకటేష్, ఉస్సేన్, శంకర్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



బాలికల ఉన్నత పాఠశాలలో..



తాడూరులో...



తెలకపల్లి ఎమ్మార్సీలో..

కందనూలు: సావిత్రీ బాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బుధవారం పలు స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సంస్కరణల గురించి వక్తలు కొనియాడారు.

అంబేద్కర్ ఐడీయాలజి మిషన్ ఆధ్వర్యంలో..

అంబేద్కర్ ఐడీయాలజి మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. మద్దిలేటి, శోభన్‌బాబు, శివ ప్రసాద్, గోవర్ధన్, శంకరయ్య, రాములన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎంఈఓ జయశ్రీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాసవీక్లబ్ చైర్మన్ గందం ప్రసాద్, గీత తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మ, మల్లేష్, కొదండ రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాయతీ ఆవరణలో సర్పంచ్ యార సుజాత, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణలు సావిత్రీ బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద బీసీ సంఘం మండల నేత వెంకట్‌నారాయణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తెలకపల్లి: మహాత్మా జ్యోతీరావ్ పూలే సతీమణి సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ఉన్న సావిత్రీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కాళిందిని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్, ఎంఈఓ రాజ శేఖర్‌రావులు సావిత్రీబాయి సేవలను కొనియాడారు. సర్పంచ్ నిర్మల, నాయకులు ప్రకాష్, ఆనంద్, రాజు యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజినేపల్లిరూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సావిత్రీ బాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిజినేపల్లి ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ బాలికల పాఠశాలలో స్వేరోస్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు రాంచందర్, శుభాకర్, చంద్రశేఖర్, యాదయ్య, యశోద, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: సావిత్రీబాయి పూలే జయంతిని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి చిత్ర పటానికి ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్ కవిత, ఎంపీటీసీ నాగశ్రీ, హెచ్‌ఎం సులోమీనా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ప్రదీప్, వెంకటేష్, స్వామి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



బిజినేపల్లి: సావిత్రీబాయి పూలే సేవలు వివరిస్తున్న ఎస్‌ఐ



తిమ్మాజిపేటలో...

Zone Guide

నేడు, రేపు ఐతోల్‌లో క్రీడలు

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో సింగిరెడ్డి పర్వత్‌రెడ్డి స్మారక ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా హెచ్‌ఎం చొరవ చూపాలన్నారు. గురువారం పరుగుపందెం, కుర్చీలాట, తాడాట, షార్ట్ పుట్ విభాగాల్లో ప్రతి పాఠశాల నుంచి పాల్గొనాలన్నారు. ఆటల పోటీలలో పాల్గొనే విద్యార్థుల వివరాలను గుంత కోడూరుయూపీఎస్ హెచ్‌ఎం శేషగిరి నం. 9440371439 నంబర్‌కు సమాచారం తెలియజేయాలన్నారు.

నిరంతర విద్యుత్ ఎంతో ఉపయోగకరం

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: నిరంతర విద్యుత్ సరఫరా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లగంటి వెంకటయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల్లో 24 గంటల విద్యుత్ సరఫరా రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని, సీఎం కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో సంతోషకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎత్మతాపూర్ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఖరీదుదారుల సంఘం అధ్యక్షుడు విశ్వం, కమీషన్‌దారుల సంఘం అధ్యక్షుడు మనోహర్, ఇంద్రకల్ రైతులు పరమేశ్వర్, తిరుపతిరెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలో భాగస్వాములు కండి

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న ముగ్గుల పోటీలలో మహిళలు భాగస్వాములు కావాలని టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మహిళా ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి నుంచి 12వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, 4, 5, 6 తేదీలలో గ్రామీణ స్థాయిలో, 8 నుంచి 11 వరకు మండల స్థాయిలో, 12న జిల్లా కేంద్రంలో పోటీలు ఉంటాయన్నారు. లక్నారం సర్పంచ్ పల్లవి, తిమ్మాజిపేట ఎంపీపీ జయలక్ష్మి, తాడూరు ఎంపీపీ సుధారాణి, పాలెం సర్పంచ్ సుమలత, కౌన్సిలర్లు కల్పన, పద్మమ్మ, రేణుక, మహిళా సభ్యులు భాగ్యమ్మ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని ఎమ్మార్పీస్ రాష్ట్ర కార్యదర్శి గూట విజయ్ విమర్శించారు. బుధవారం ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం నిర్వహిస్తున్న మందకృష్ణ మాదిగను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ మండలంలోని పెద్దాపూర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో టీఆర్‌ఎస్ పాలకులు మాదిగలను అణిచే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మందకృష్ణ శాంతియుతంగా 48గంటలు ఉపవాస దీక్షకు పూనుకుంటే నిర్ధక్షిణ్యంగా అరెస్టు చేయించడం తగదన్నారు. ఎమ్మార్పీస్ నాయకులు నాగేస్, సుధాకర్, దేశయ్య, చంద్రశేఖర్, విష్ణు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు నివారణ శిబిరం విజయవంతమైంది. బుధవారం మండలంలోని ఐతోల్, ఎంగంపల్లి గ్రామాల్లో శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ సీజనల్‌గా పశువుల్లో వ్యాపించే వివిధ రోగాలకు సంబంధించి నిర్వహించే శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది రమేష్, మల్లేష్, లక్ష్మమ్మ, మధు, అసియాబేగం,ఆనంద్, రైతులు నర్సింహ్మారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

బిజినేపల్లిరూరల్: డిసెంబర్ నుంచి జనవరి నెలలో గాలికుంటు నివారణ మందులు తప్పనిసరిగా వేయాలని పశువైద్యాధికారి వెంకటేష్‌రెడ్డి, నిరంజన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుడ్లనర్వలో పశువులకు గాలికుంటు నివారణ మందులను వేశారు. పశువైద్య సిబ్బంది శ్రీనివాసులు, సర్పంచ్ మాలిక్, రైతులు పాల్గొన్నారు.

రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి..

బిజినేపల్లిరూరల్: మండలంలోని వెల్గొండకి చెందిన టీడీపీ మండల యూత్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో పనిచేయాలి

తెలకపల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జీపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తరగతి గదిలో శ్రద్ధగా పాఠాలు వినాలని, ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి విద్యనందించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనం తదితర వసతులు కల్పిస్తుందని అన్నారు. ఆమె వెంట పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌దాసు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతి

బిజినేపల్లిరూరల్: చట్టబద్ధంగా వర్గీకరణ చేయాలంటూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీంద్రకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 24 సంవత్సరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నాడని, కానీ ప్రతిఏటా రాజకీయ నాయకులు మాదిగల ఓట్లతో గెలుపొంది అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని మాటలు చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర రాములు, పరుశరాములు, తిరుపాలు, సుధాకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

బొమ్ముకుంట ఆలుగు పరిశీలన

తాడూరు: మండల కేంద్రంలోని బొమ్ముకుంట అలుగును తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌ఓ ఉస్సేన్ పరిశీలిం చారు. బుధవారం గ్రామానికి చెందిన ఓ రైతు నీటిని అక్రమంగా వదులుతున్నాడని, దీంతో తమ పంటలు పాడవుతున్నాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారు పరిశీలించారు.

పూసల సంచార జాతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పూసల సంచార జాతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఈద్గా వద్ద పూసల కులస్తుల మండల మహాసభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏళ్ల తరబడి సంచార ఈవనం కొన సాగిస్తున్న పూసల కులస్తులు దుర్భర జీవితం గడుపు తున్నారని అన్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూసల కులస్తులు తన్నీరు మల్లయ్య, సుధాకర్, బాలస్వామి, వెంకటేష్, రామస్వామి పాల్గొన్నారు.

'ఉమ్మెత్త'ను జంతువులు ఎందుకు తినవు?



పి. నీలకంఠయ్య
స్కూల్ అసిస్టెంట్

10th Class Special
బయాలజీ (తె.మీ.)


విసర్జన - వ్యర్థాల తొలగింపు వ్యవస్థ

సజీవుల మనుగడకు, వివిధ జీవక్రియల నిర్వహణకు శక్తి అవసరం. జీవులన్నీ జీవక్రియల నిర్వహణలో వివిధ రకాల పదార్థాలను ఉపయోగిస్తాయి. ఫలితంగా అనేక రకాల పదార్థాలు ఉత్పన్నమవుతాయి. వీటిలో హాని చేసే పదార్థాలను విసర్జించి, కొన్నింటిని వేరే రూపంలోకి మార్చుకుని నిల్వచేసుకుంటాయి. విసర్జన.. సజీవుల్లో జరిగే ఒక జీవక్రియ.

మన శరీరంలో ఉత్పన్నమయ్యే కార్బన్ డై ఆక్సైడ్, నత్రజని సంబంధిత వ్యర్థాలైన అమ్మోనియా, యూరియా, యూరికామ్లం, పైత్యరస వర్ణకాలు, అదనపు లవణాలు ఉంటాయి. కాబట్టి వీటిని శరీరం బయటికి విసర్జించాలి.

మానవ విసర్జక వ్యవస్థ

మానవుడిలో ఒక జత మూత్రపిండాలు, మూత్ర నాళాలు, మూత్రాశయం ఉంటాయి. మూత్రపిండం చిక్కుడుగింజ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. ఉదర కుహరంలో పృష్ఠశరీర కుడ్యానికి మూత్రపిండాలు అతుక్కుని వెన్నెముకకు ఇరువైపులా అమరి ఉంటాయి.



విసర్జన వ్యవస్థ


మూత్రపిండంలో పుటాకారంగా ఉన్న లోపలితలం మధ్యలోని పల్లాన్ని 'హైలస్' అంటారు. దీనిద్వారా వృక్కధమని మూత్రపిండంలోకి, వృక్కసిర మూత్రనాళం వెలుపలికి వస్తాయి. అంతర్నిర్మాణంలో ముదురు గోధుమ వర్ణంలో ఉన్న వెలుపలి భాగాన్ని 'వల్కలం'అని, లేత గోధుమ వర్ణంలో ఉన్న లోపలి భాగాన్ని 'దవ్వ' అని అంటారు. ప్రతీ మూత్రపిండంలో 1మిలియన్ కంటే ఎక్కువ నెఫ్రాన్‌లు ఉంటాయి.

ప్రతి నెఫ్రాన్‌లోనూ మాల్పీజియన్ దేహం, వృక్కనాళిక ఉంటాయి. మాల్పీజియన్ దేహంలో రక్తకేశనాళికలు గుచ్ఛంలా ఏర్పడి ఉంటాయి. దీన్ని 'గ్లామెరూలస్' అంటారు. గ్లామెరూలస్‌లో అధివాహి ధమనిక వ్యాసం.. అపవాహిధమనిక వ్యాసం కంటే ఎక్కువగా ఉంటాయి. దీంతో గుచ్ఛంలో పీడనం పెరిగి దానిలోని పదార్థాలు వడపోతకు గురవుతాయి. వృక్కనాళికలో సమీపస్థ సంవళితనాళం, హెన్లీశిక్యం, దూరస్థ సంవళిత నాళాలు ఉంటాయి. వృక్కనాళిక సంగ్రహణ నాళం ద్వారా చివరికి ద్రోణిలోకి తెరుచుకుంటుంది.

మూత్రం ఏర్పడే విధానం

మూత్రాశయంలో 700-800 మి.లీ. మూత్రం నిల్వ ఉంటుంది. మానవుడు రోజుకు సుమారు 1.6-1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు.

మూత్రం లేత పసుపురంగు ద్రవం. రక్తంలోని



మూత్రం తయారీ విధానం

హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం ఈ రంగుకు కారణం. అదే విధంగా మూత్రంలో 96శాతం నీరు, 2.5శాతం కర్బన పదార్థాలు (యూరియా, యూరిక్ ఆమ్లం, క్రియాటిన్ మొదలైనవి) ఉంటాయి.

మూత్రపిండాలు పనిచేయకపోవడం

వివిధ కారణాల వల్ల మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోతే శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోతాయి. ఈ దశను 'యురేమియ' అంటారు. ఫలితంగా కాళ్లు, చేతులు ఉబ్బుతాయి. దీనికి పరిష్కారంగా డయాలసిస్ యంత్రంతో రక్తాన్ని వడకడతారు. దీన్నే 'హిమోడయాలసిస్' అని అంటారు. ఈ సమస్య దీర్ఘకాలిక పరిష్కారం కోసం మూత్రపిండ మార్పిడి చేస్తారు. దాతల నుంచి అవయవాలను సేకరించి అమరుస్తారు. మానవుడిలో ఊపిరితిత్తులు, చర్మం, కాలేయం అనుబంధ విసర్జకాంగాలు.

మొక్కలు కూడా విసర్జనను జరుపుకొంటాయి. వీటిలో ప్రత్యేకమైన అవయవాలు లేవు. వ్యర్థాలు ఏర్పడే ప్రక్రియ మొక్కల్లో చాలా నెమ్మదిగా జరుగుతుంది. బాష్పోత్సేకం, బిందుస్రావం వ్యర్థాలను పండ్లల్లో రాఫైడ్‌లుగా నిల్వ చేసి మొక్కలు బయటికి పంపుతాయి. పిండిపదార్థాలు, ప్రొటీన్‌లు, కొవ్వులు అనేవి ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు. ఆల్కలాయిడ్‌లు, టానిన్‌లు, రెసిన్‌లు, జిగురులు, లేటెక్స్ మొదలైనవి ద్వితీయ జీవక్రియోత్పన్నాలు. ఇవి ఆర్థిక ప్రాధాన్యం కలవి.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

1. మూత్రపిండ అంతర్నిర్మాణం
2. నెఫ్రాన్ నిర్మాణం
3. మూత్రం ఏర్పడే విధానం
4. హిమోడయాలసిస్
5. వివిధ జీవుల్లో విసర్జక వ్యవస్థ
6. ఆల్కలాయిడ్‌లు
7. మూత్రపిండం అధ్యయనం-ప్రయోగశాల కృత్యం

ముఖ్య ప్రశ్నలు-జవాబులు

1. మొక్కల్లో తయారయ్యే పదార్థాలను ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు, ద్వితీయ జీవక్రియోత్పన్నాలుగా వర్గీకరిస్తారు. ఈ రెండింటికీ ఒక్కో ఉదాహరణ రాయండి.

జ. **ప్రాథమిక జీవక్రియోత్పన్నాలు.**
ఉదా: పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు.
ద్వితీయ జీవక్రియోత్పన్నాలు:
ఉదా: ఆల్కలాయిడ్‌లు, రెసిన్‌లు, టానిన్‌లు, జిగుర్లు, లేటెక్స్.

2. జంతువుల నుంచి రక్షించుకోవడానికి మొక్కలు అనుసరించే విధానాలను మీ గ్రామంలో ఉన్న రెండు మొక్కలను ఉదాహరణగా తీసుకుని వివరించండి.

జ. **ఉమ్మెత్త:** ఈ మొక్కలో 'స్కోపాలమైన్' అనే ఆల్కలాయిడ్ విషపూరితంగా ఉండటం వల్ల వీటిని జంతువులు తినవు.
అత్తిపత్తి: తాకిన వెంటనే ఇవి ముడుచుకుంటాయి. తమనుతాము రక్షించుకుంటాయి.

3. మానవ శరీరంలో మూత్రపిండం ఒక ముఖ్యమైన విసర్జకావయవం. మానవుడిలో విసర్జన క్రియను అదనపు విధిగా నిర్వహించే అవయవాలు, అవి విసర్జించే పదార్థాల పేర్లు రాయండి.

జ. ***అనుబంధ విసర్జకావయవాలు***
i) ***ఊపిరితిత్తులు:*** CO_2, నీటి ఆవిరి
ii) ***చర్మం:*** లవణాలు అధికంగా ఉన్న నీటిని చెమట రూపంలో విసర్జిస్తుంది
iii) ***కాలేయం:*** యూరోక్రోమ్, పైత్యరస వ్యర్థాలు
iv) ***పెద్దపేగు:*** కాల్షియం, మెగ్నీషియం, ఐరన్‌ల లవణాలు

4. మూత్రపిండాన్ని విచ్ఛిన్నం చేసి, అందులోని భాగాలను మీరు పరిశీలించారు కదా, అయితే ఈ ప్రయోగం ఎలా నిర్వహించాలో వివరించండి.

జ. మూత్రపిండం బాహ్య, అంతర లక్షణాలను తెలుసుకోవడానికి మూత్రపిండాన్ని విచ్ఛిన్నం చేసి కింది విధంగా పరిశీలించాను.


కావాల్సిన పదార్థాలు: మాంసం కొట్టులో సేకరించిన మేక లేదా గొర్రె మూత్రపిండం లేదా మూత్రపిండ త్రీడీ నమూనా, పదునైన బ్లేడ్, ట్రే, నీరు.


మూత్రపిండం నిలువుకోత

పరిశీలనా విధానం:
i) మేక లేదా గొర్రె మూత్రపిండాన్ని సేకరించి, రక్తమంతా పోయేలా నీటితో శుభ్రంగా కడిగాను.
ii) పూర్తిగా ఆరిన తర్వాత దాన్ని ఒక ట్రేలో ఉంచి జాగ్రత్తగా పరిశీలించి, నోట్‌బుక్‌లో పరిశీలనలు నమోదు చేశాను.
iii) ఒక పదునైన బ్లేడు లేదా స్కాల్‌పెల్ సాయంతో మూత్రపిండాన్ని నిలువుగా కట్ చేసి, అంతర్గత నిర్మాణాన్ని పరిశీలించాను.

ఫలితాలు:
i) మూత్రపిండాలు చిక్కుడుగింజ ఆకారంలో ఉన్నాయి.
ii) ముదురు ఎరుపు రంగులో ఉన్నాయి.
iii) మూత్రపిండంపై గ్రంథుల్లాంటి నిర్మాణాలు అతుక్కుని ఉన్నాయి.
iv) హైలస్ ద్వారా వృక్కధమని లోనికి ప్రవేశిస్తుంది. వృక్కసిర, మూత్రనాళం వెలుపలికి వస్తాయి.


5. విసర్జక వ్యవస్థలో నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణమని దేన్ని పేర్కొంటారు. దాని బొమ్మ గీసి భాగాలు గుర్తించండి. అభివాహి ధమనిక వ్యాసం, అపవాహి ధమనిక వ్యాసం కంటే ఎక్కువ ఉండటానికి కారణం ఏమిటి?



నెఫ్రాన్ నిర్మాణం

జ. విసర్జక వ్యవస్థలో నెఫ్రాన్‌ను నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం అంటారు. అభివాహి ధమనిక వ్యాసం, అపవాహి ధమనిక వ్యాసం కంటే ఎక్కువ ఉండటానికి కారణం గ్లామెరూలస్‌లో పీడనం పెరిగి, దానిలోని పదార్థాలు వడపోతకు గురవుతాయి.

6. కింది చిత్రాల్లో ఉన్న జీవుల్లోని విసర్జక వ్యవస్థలను పట్టిక రూపంలో రాయండి



జ.

జీవిపేరు / వర్గం	విసర్జక వ్యవస్థ
ప్రోటోజోవా	కణం ఉపరితలం నుంచి వ్యాపనం ద్వారా
అనెలిడా	నెఫ్రీడియా
ఆర్థ్రోపొడ	హరిత గ్రంథులు, మాల్పీజియన్ నాళికలు
మానవుడు	మూత్రపిండాలు

'పరభాష ద్వారా బోధన అంటే సోపానాలు లేని సౌధం'



డాక్టర్ పి.వి.సుబ్బారావు
సబ్జెక్టు నిపుణులు

తెలుగు మెథడాలజీ

టీఎస్‌పీఎస్సీ టీఆర్‌టీ ఎస్‌జీటీ - తెలుగు ప్రత్యేకం

తెలుగు స్కూల్ అసిస్టెంట్స్ (ఎస్ఏ), లాంగ్వేజ్ పండిట్స్ (ఎల్‌పీ)కి మెథడాలజీ (బోధనాశాస్త్రం) కీలకమైంది. పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలి. తెలుగు కంటెంట్ కంటే మెథడాలజీ కష్టమైన అంశం. ఈ సిలబస్‌లో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. వాటిని ఏ విధంగా చదవాలి అనే అంశాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలిద్దాం.

1. భాష-వివిధ భావనలు

ఇది సుదీర్ఘమైన అధ్యాయం. దీనిలో అతి ముఖ్యమైన అంశం ప్రథమ భాషగా తెలుగు బోధనోద్దేశాలు, లక్ష్యాలు, స్పష్టీకరణలతోపాటు కనీస అభ్యసన స్థాయికి సంబంధించిన అంశాలు చదవాలి. ద్వితీయ భాషగా తెలుగును ఎలా బోధించాలో శ్రద్ధగా చదవాలి. ఈ అధ్యాయం నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది.

ఉదా: స్వతస్సిద్ధ వాదాన్ని ప్రతిపాదించిన భాషావేత్త ఎవరు?
1) యాస్కాచార్యుడు
2) మాక్స్ ముల్లర్
3) నోమ్ చామ్‌స్కీ 4) బి.ఎఫ్. స్కిన్నర్

సమాధానం: (3) నోమ్ చామ్‌స్కీ

ఉదా: తెలుగును ద్వితీయ భాషగా బోధిస్తున్నప్పుడు మొదట సాధించాల్సిన విలువలు ఏవి?
1) అగణిత విలువలు
2) హృదయ గత విలువలు
3) పరిమిత విలువలు
4) పరోక్ష విలువలు

సమాధానం: (3) పరిమిత విలువలు

2. భాషా నైపుణ్యాలు

ఈ అధ్యాయంలో వ్యక్తిత్వ వికాస సోపానాలైన శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం అనే నాలుగు నైపుణ్యాలను శ్రద్ధగా చదవాలి. వీటి అంతర్గత సంబంధాలను ప్రత్యేకంగా పరిశీలించాలి. దీనిలో 'భాషణం'లో భాగంగా వాగుత్పత్తి, వాగింద్రియ నిర్మాణం, వర్ణోచ్ఛారణ స్థానాలు (స్థాన-కరణ, ప్రయత్నాలు), వాటి నివారణోపాయాలను చదవాలి.

3. ప్రణాళిక రచన-పాఠ్యగ్రంథాలు

ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా వర్గీకరించి చదవాలి. మొదటి భాగంలో 'విద్యా ప్రణాళిక, మౌళిక విద్యా ప్రణాళిక, పాఠ్య విషయ ప్రణాళిక, వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళికతో పాటు పాఠ్యభాగ పథకాన్ని చదవాలి. రెండో భాగంలో పాఠ్య పుస్తకాలైన ప్రధాన వాచకం, నిర్మాణ సూత్రాలు, పాఠ్య పుస్తకాల జాతీయీకరణ, ఉపవాచకం, కృషి పుస్తకం, (Workbook), ఆధ్యాత్మిక దర్శిని లాంటి అంశాలను శ్రద్ధతో అధ్యయనం చేయాలి. ఈ అధ్యాయం నుంచి పాఠ్యాంశాల అన్వయ ప్రశ్నలు అడిగే అవకాశం తక్కువగా ఉంటుంది.

4. విద్యా సాంకేతిక శాస్త్రం-సహ పాఠ్య కార్యక్రమాలు

ఈ అధ్యాయాన్ని రెండు భాగాలుగా విభజించి చదవాలి. మొదటి భాగంలో బోధనోపకరణాల్లో రకాలైన శ్రవ్య, దృశ్యం, దృశ్య-శ్రవ్య బోధనోపకరణాలను పరిశీలనా దృష్టితో చదవాలి. కొన్నిసార్లు ఈ విభాగం నుంచి అత్యంత కఠినమైన ప్రశ్నలు అడుగుతుంటారు.

రెండో భాగమైన సహ పాఠ్య కార్యక్రమాల్లో భాగంగా భాషా క్రీడలు, వక్తృత్వం, ఉక్త రచన, వ్యాస రచన, పత్రిక నిర్వహణ, భాషా విహార యాత్రలు, సారస్వత సంఘాలు, గ్రంథాలు, పఠనాలయాలు, పరామర్శ గ్రంథాలు, మూల గ్రంథాలకు సంబంధించిన అంశాల గురించి స్థూలమైన అవగాహనతో చదవాలి.

5. సాహిత్య ప్రక్రియలు-బోధనా పద్ధతులు

ఇది మెథడాలజీ సిలబస్‌లో కీలకమైన అధ్యాయం. విస్తృతమైంది. ఎక్కువగా అన్వయ ప్రశ్నలకు అవకాశం ఉన్న అధ్యాయమిది. ఇందులో పద్య బోధన, గద్యబోధన, వ్యాకరణ బోధన, ఉపవాచక బోధన, కథా బోధన, నాటక బోధనలకు సంబంధించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

ఆధునిక ధోరణులైన క్రీడా, కిండర్ గార్టెన్, మాంటిస్సోరి, ప్రాజెక్టు, డాల్టన్, కృత్యాధార, నాటకీకరణ పద్ధతులను సూక్ష్మదృష్టితో చదవాలి. ఇందులో భాగంగా కార్యక్రమయుత బోధన, బృంద బోధన, సూక్ష్మ బోధనల గురించి అధ్యయనం చేయాలి. వీటిపై అన్వయాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఈ అధ్యాయం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి వీలుంది.

6. మూల్యాంకనం

ఒక పనిని పూర్తి చేసిన తర్వాత అది ఎంతమేరకు ఫలప్రదమైందో తెలుసుకునేందుకు దోహదపడే అంశం మూల్యాంకనం (Evaluation). ఇందులో నికష, పరీక్ష, పరిగణన, మదింపు, మూల్యాంకనం అనే భావనలు, వాటి తారతమ్యాల గురించి సూక్ష్మ దృష్టితో చదవాలి. నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)లో భాగంగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను అధ్యయనం చేయాలి. వ్యాసరూప, లఘుత్తర, అతి లఘుత్తర, లక్ష్యాత్మక ప్రశ్నలపై దృష్టి సారించాలి.

పాటించాల్సిన సూచనలు

- ఆరు అధ్యాయాల సిలబస్‌లో 1, 5 అధ్యాయాలు కీలకమైనవి. వీటి నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- గత డీఎస్సీ, టెట్ ప్రశ్నాపత్రాల్లోని మెథడాలజీ ప్రశ్నలను చదవాలి.
- మెథడాలజీ నుంచి డీఎస్సీకి 32 ప్రశ్నలు వస్తాయి. వాటికి 16 మార్కులు. టెట్‌కు 6 ప్రశ్నలుంటాయి. వాటికి 6 మార్కులు. సిలబస్ దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి నోట్స్ తయారు చేసుకోవాలి.
- తెలుగు అకాడమీ డీఎడ్, బీఎడ్ మెథడాలజీ గ్రంథాలు చదవాలి.
- కంటెంట్‌తో అనుసంధానం చేసుకుంటూ మెథడాలజీని చదవాలి.
- పాఠ్య పుస్తక నిర్మాణ సూత్రాలను చదివేటప్పుడు పాఠ్య పుస్తక ఇతివృత్తాలతో అనుసంధానం చేసుకోవాలి.
- ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- మూల్యాంకనంలో వస్తున్న నిత్యనూతన మార్పులను అవగాహన చేసుకుని చదవాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వక్తృత్వ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో పెంపొందే నైపుణ్యం ఏది? (టెట్-2014)
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

2. భాషా ఉద్దేశాలు ఆరంభాలైతే, అంత్య ఫలితాలు ఏవి? (టెట్-2012)
1) ప్రయోజనాలు 2) పఠన పాటవాలు
3) అభ్యసనం 4) అనువర్తనాలు

3. వాచిక చర్యకు ముఖ్య ఆధారం? (టెట్-2012)
1) అభిప్రాయావళి 2) వైఖరీ నికష
3) పరిపృచ్ఛ 4) ప్రశ్నావళి

4. సాధారణంగా ఉక్త లేఖనాంశాన్ని మూడు సార్లు చెప్పాలి. అలా మొదటిసారి చెప్పినప్పుడు విద్యార్థి చేయవలసింది ఏది? (టెట్-2011)
1) తప్పులు సరిచూసుకోవాలి
2) ఏకాగ్రతతో వినాలి
3) వినాలి - రాయాలి 4) రాయాలి

5. పఠన లేఖనాంశాల్లో పఠనాన్ని 'స్వభ్రాంశం' అంటారు. మరి లేఖనాన్ని ఏమంటారు? (టెట్-2011)
1) ప్రేరణాంశం 2) శబ్దాంశం
3) కారకాంశం 4) లక్షణాంశం

6. తరగతి గదిలో విద్యార్థుల శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపాధ్యాయుడు దృష్టిసారించాల్సిన ఒక అంశం ఏది? (టెట్-2012)
1) క్షుణ్నంగా పఠనం చేయాలి
2) కఠిన పదాలను పరిచయం చేయడం
3) పాఠాలను బాహ్యంగా చదివించడం
4) పాఠాలను మౌనంగా చదివించడం

7. 'ధ్వని, భావం మధ్య అనురూపమైన సంబంధం ఉంటుందని, ప్రకృతి అంతా లయాత్మకమని, ప్రతి పదార్థం ప్రకంపనలను కలిగి ఉంటుందని, ఆ ప్రకంపనలకు అనుగుణంగానే వక్త నోట శబ్దాలు వెలువడుతాయి' అని చెప్పే వాదం ఏది? (టెట్-2012)
1) బౌ-వౌ వాదం
2) డింగ్‌డాంగ్ వాదం
3) ధాతు వాదం 4) స్వతస్సిద్ధ వాదం

8. శిక్షణ బదలాయింపు సూత్రాన్ని అనుసరించి ప్రధాన వాచక అధ్యయనం దేనికి తోడ్పడుతుంది? (టెట్-2012)
1) భాషా లక్ష్యాల సాధన ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం
2) మాతృభాష ద్వారా సాధించిన భాషా నైపుణ్యాలను ఇతర భాషల అధ్యయనానికి వినియోగించడం
3) భాషా నైపుణ్యాల అభివృద్ధి ద్వారా భాషా లక్ష్యాలను సాధించడం
4) భాషాభిరుచిని పెంపొందించడం ద్వారా విరామ కాలాన్ని సద్వినియోగం చేయడం

9. 'భాషకు మూలం కొన్ని ధాతువులే' అని ప్రతిపాదించినవారు?
1) గార్డి 2) ఎలెన్ గార్డినర్
3) యాస్కాచార్యుడు 4) కాత్యాయనుడు

సమాధానాలు

1) 2 2) 1 3) 4 4) 2 5) 3
6) 1 7) 2 8) 2 9) 3

మాదిరి ప్రశ్నలు

1. భాషను 'మేధస్సు ప్రసరించే కాంతి'గా వర్ణించిన భాషావేత్త ఎవరు?
1) బెంజిమెన్ వార్ఫ్
2) ఎడ్వర్డ్ సఫైర్ 3) జాన్ స్టువర్ట్‌మిల్
4) ప్రొఫెసర్ విట్నీ

2. భాషను 'బహుముఖ వ్యవస్థ'గా వర్ణించిన వారెవరు?
1) ఎడ్వర్డ్ సఫైర్ 2) ఫిర్త్
3) విలియం జేమ్స్ 4) హాకెట్

3. 'ఉన్నత సంక్లిష్ట సూత్రజాలావలయం భాష' అని ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
1) లింగ్విస్టిక్ చేంజ్
2) మోడరన్ లింగ్విస్టిక్స్
3) లాంగ్వేజ్ ఈజ్ ది మోడరన్ వరల్డ్
4) ది సైన్స్ ఆఫ్ లాంగ్వేజ్

4. 'ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులు పలుకుతుంది' అని తెలిపే భాషావాదం ఏది?
1) యోహెహో వాదం
2) డింగ్‌డాంగ్ వాదం
3) స్వతస్సిద్ధ వాదం 4) అనుభవ వాదం

5. ఆధునిక భాషా శాస్త్రవేత్తలు సైతం అంగీకరిస్తున్న భాషోత్పత్తివాదం ఏది?
1) భగవద్దత్త వాదం
2) ధాతు వాదం 3) ప్రకంపనా వాదం
4) టటటట వాదం

6. 'డింగ్‌డాంగ్ వాదానికి' మరో పేరు?
1) పూపూ వాదం 2) స్వతస్సిద్ధ వాదం
3) ప్రకంపనా వాదం
4) సంపాదనా వాదం

7. కింది వాటిలో సరికానిది ఏది?
1) డింగ్‌డాంగ్ వాదం - మాక్స్ ముల్లర్
2) ధాతు వాదం - యాస్కాచార్యుడు
3) స్వతస్సిద్ధ వాదం - లిబ్నిజ్
4) పూపూ వాదం - కొండెకిల్

8. 'మాతృభాష తల్లి పాలలాంటిది. పరభాష దాది పాలలాంటిది' అని పేర్కొన్న వారెవరు?
1) మహాత్మాగాంధీ
2) కొమర్రాజు లక్ష్మణరావు
3) రవీంద్రనాథ్ ఠాగూర్
4) గొడవర్తి సూర్యనారాయణ

9. 'పరభాష ద్వారా బోధన అంటే సోపానాలు లేని సౌధంలాంటిది' అని తెలిపిన వారెవరు?
1) రైబర్న్
2) వావిలాల గోపాలకృష్ణయ్య
3) రవీంద్రనాథ్ ఠాగూర్
4) గొడవర్తి సూర్యనారాయణ

10. మాతృభాషకు ఉన్న పేర్లు?
1) ప్రాంతీయ భాష
2) దేశీయ భాష - స్థానిక భాష
3) ప్రథమ భాష - అధికార భాష
4) పైవన్నీ

11. 'శిశువు సౌందర్య దృష్టినీ, ఆనందానుభూతినీ వ్యక్తం చేయడానికి ఉపయోగపడేది మాతృభాష' అని నిర్వచించినవారు?
1) మహాత్మా గాంధీ
2) వావిలాల గోపాలకృష్ణయ్య
3) గొడవర్తి సూర్యనారాయణ
4) రైబర్న్

12. ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా స్వీకరించడానికి ఆయా రాష్ట్రాలకు అధికారం కల్పించిన రాజ్యాంగ అధికరణ ఏది?
1) 342 2) 345
3) 343 4) 346

13. అధికార భాషా సంఘం ఏ తేదీన ఏర్పడింది?
1) 1968 మార్చి 19
2) 1966 మార్చి 19
3) 1964 ఏప్రిల్ 10
4) 1966 ఏప్రిల్ 1

14. అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు ఎవరు?
1) అయ్యదేవర కాళేశ్వరరావు
2) వావిలాల గోపాల కృష్ణయ్య
3) వందేమాతరం రామచంద్రరావు
4) నండూరి రామకృష్ణమాచార్యులు

15. కింది వారిలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు కాని వారెవరు?
1) ఆచార్య పి. యశోదారెడ్డి
2) ఆచార్య సి. నారాయణరెడ్డి
3) ఆచార్య నాయని కృష్ణకుమారి
4) గజ్జెల మల్లారెడ్డి

16. తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎవరు?
1) డాక్టర్ ఎన్. గోపి
2) బి.ఎస్. రాములు
3) కాలువ మల్లయ్య
4) దేవులపల్లి ప్రభాకరరావు

17. కింది వాటిలో త్రిభాషా సూత్రంలో ద్వితీయ భాషగా హిందీని వ్యతిరేకించిన రాష్ట్రం ఏది?
1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
3) తమిళనాడు 4) కేరళ

18. తెలంగాణ రాష్ట్రంలో ద్వితీయ అధికార భాష ఏది?
1) హిందీ 2) ఉర్దూ
3) మరాఠీ 4) కన్నడ

19. ప్రథమ భాషగా తెలుగు బోధనలో ప్రధాన ఉద్దేశం?
1) అర్థ గ్రహణం 2) అభివ్యక్తి
3) గుణ వివేచన 4) పైవన్నీ

20. తెలుగును ద్వితీయ భాషగా ఏయే మాతృభాషల వారు అభ్యసిస్తున్నారు?
1) హిందీ, ఉర్దూ
2) తమిళం, కన్నడం
3) గుజరాతీ, ఒరియా, మరాఠీ
4) పైవన్నీ

21. ద్వితీయ భాషగా తెలుగు బోధన ఉద్దేశం?
1) తెలుగు భాష సంస్కృతిని తెలియజేయడం
2) దైనందిన కార్యక్రమాల్లో తెలుగును ఉపయోగించే నైపుణ్యాన్ని పెంపొందించడం
3) తమ భాషల్లోని భావాలను తెలుగులోకి, తెలుగులోని భావాలను తమ భాషల్లోకి పరివర్తన చేసే పరిజ్ఞానం పెంపొందించడం
4) పైవన్నీ

సమాధానాలు

1) 3 2) 2 3) 3 4) 4 5) 2
6) 3 7) 3 8) 2 9) 3 10) 4
11) 1 12) 2 13) 1 14) 2 15) 3
16) 4 17) 3 18) 2 19) 4 20) 4
21) 4

నాన్నా చెప్పవా

మనిషి కన్నా జీర్ణ వ్యవస్థ పొడవుగా ఎందుకుంటుంది?




చిన్న చిన్న పురుగులు, వాన పాముల్లాంటి జీవుల జీర్ణవ్యవస్థకు సంబంధించిన నాళాలు నోటి నుంచి పాయువు దాకా, దాదాపుగా ఆ జీవులంత పొడవుంటాయి. కాని పెద్ద పెద్ద జీవుల్లో మాత్రం వాటి జీర్ణవ్యవస్థ వాటి శరీరపు పొదవుకన్నా ఎన్నో రెట్లు పొడవుగా గాని లేదా ఉపరితల వైశాల్యంలో చాలా విశాలంగా గాని ఉంటుంది. ఉదాహరణకు ఒక మనిషి పొడవు కన్నా 'అన్నవాహిక – కడుపు సంచి – చిన్న పేగులు– పెద్ద పేగుల' తో కూడిన అతని జీర్ణవ్యవస్థ 10–12 రెట్లు ఎక్కువ పొడవుగా వుంటుంది. దాని పొడవు సుమారు 10 మీటర్లకు పైగానే వుంటుంది. ఎందుకు ఇలా ఉంటుందో స్పష్టంగా అర్థం కావాలంటే ముందుగా ఒక చిన్న పురుగు మనిషంత పెద్దగా మారినట్లుగా ఊహించుకోవలసి వుంటుంది.


10 సెం.మీ.ల పొడవుండే వాన పాము 20 రెట్లు పెద్దగా మారిందను కుందాం (మనిషంత పొడవుగా). ఇలా జరిగినప్పుడు దాని పొడవు, వెడల్పు, మందం అన్నీ మారతాయి. అప్పుడు దాని బరువు మునపటి బరువుకన్నా 80,000 రెట్లు (10X20X20X20) పెరుగుతుంది. బరువుతో సమానంగా దానిలోని జీవకణాల సం ఖ్య, వాటి అవసరాలు కూడా పెరుగుతాయి.

10 సెం.మీ.ల వానపాముని 20 రెట్లు పెద్దగా చేసినప్పుడు దాని జీర్ణ నాళం 200 సెం.మీ. (10X20) పొడవవు తుంది. ఆ జీర్ణనాళపు మందం కూడా పెరిగి అది 200 రెట్లు పెద్దగా (10X20) అవుతుంది. అయితే పెరిగే ఈ మందం వల్ల ఎలాంటి ప్రత్యేక ప్రయోజనమూ చేకూరదు. మొత్తానికి వానపాములోని జీవకణాల సంఖ్య 80,000 రెట్లు పెరిగితే, దాని జీర్ణనాళం మాత్రం పొడ వులో 20 రెట్లు, ఉపరితల వైశాల్యంలో 4000 రెట్లు పెద్దగా మారుతుంది. అయితే శరీరంలోని జీవకణాల సంఖ్యతో పోల్చినప్పుడు జీర్ణనాళపు ఈ ఉపరితల వైశాల్యం ఏ మాత్రం సరిపోదు. అంత కన్నా 10–15 రెట్లకు పైగా వైశాల్యం కావలసి వుంటుంది. సరిగ్గా ఈ కారణం వల్లనే మనిషి జీర్ణాశయం అతని కన్నా చాలా రెట్లు పెద్దగా వుంటుంది.

అంకెలు కలపండి రంగులు వేయండి




పూరించండి



కుడివైపున కొన్ని బ్రాకెట్స్, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లిష్ పదం మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి








ఈ రెండు బొమ్మల మధ్య 8 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.


దారి కనుక్కోండి



F	S	K	A	T	I	N	G	H	O	C	K	E	Y	V
V	U	S	B	J	T	M	P	W	O	L	P	T	D	W
P	T	N	P	B	O	O	T	S	F	Y	S	A	L	T
S	N	O	W	M	A	N	Y	C	C	S	T	O	R	M
E	F	W	T	Z	L	S	E	I	R	R	U	L	F	S
S	F	M	L	E	E	L	Y	E	O	Y	Y	D	N	E
E	O	O	M	E	M	I	A	U	M	A	V	O	I	R
K	G	B	S	W	O	P	S	B	L	F	W	G	H	U
A	N	I	H	V	B	P	A	P	W	B	M	N	S	T
L	I	L	O	B	B	E	N	N	L	O	L	I	K	P
F	D	E	V	D	U	R	D	O	Q	U	N	H	I	L
X	I	N	E	D	B	Y	W	W	X	J	P	S	I	U
Z	L	K	L	N	I	E	L	D	T	L	D	I	N	C
F	S	V	V	L	R	K	T	F	I	R	D	F	G	S
T	S	C	R	A	P	E	R	J	W	W	H	I	T	E

BOOTS
DRIFT
FISHING
FLAKES
FLURRIES
FUN
HOCKEY
ICY
PLAY
PLOW
SALT
SAND
SCRAPER
SCULPTURE
SHOVEL
SKATING
SKIING
SLIDING
SLIPPERY
SNOWBALL
SNOWBLOWER
SNOWMAN
SNOWMOBILE
STORM
WHITE

పైన కొన్ని పదాలు ఉన్నాయి. పక్కన ఉన్న పజిల్‌లో ఆ పదాలు ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం!




ఈ బాతుపిల్ల అసలు నీడ ఏదో కనిపెట్టండి చూద్దాం!

వరి నాట్ల పండుగొచ్చింది!

కందనూలు అంటే వలసలు, కరువు, వెనకబాటు.. ఇది ఒక్కప్పటి మాట. ప్రస్తుతం అది చెరిగిపోతోంది. వెళదామనుకున్న వాళ్లు ఆగిపోతున్నారు! కొన్నిచోట్ల వెళ్లిన వాళ్లు తిరిగి వచ్చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ బీడుగా ఉన్న భూములు పచ్చగా కనిపిస్తున్నాయి. ఇందుకు కారణం.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. ఇప్పుడు నిండిన జలాశయాలతో, పచ్చని పంటలతో ఈ ప్రాంతం కళకళలాడుతోంది. ప్రస్తుతం కేఎల్ఐ కింద రైతాంగం రబీ వరి నాట్లలో బిజీబిజీగా కాలం గడుపుతున్నారు. సన్న, చిన్నకారు రైతులు ఒకరితో ఒకరు పోటీపడి త్వరగా నాట్లు వేస్తున్నారు. చాలా రోజుల తర్వాత తమ పొలాలకు సాగునీరు అందడంతో రైతాంగం ఆనందంలో పారవశ్యానికి లోనవుతుండగా కూలీలు ఉత్సాహపరిచే పాటలతో నాట్లు వేస్తూ పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నారు. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాలలో నాట్లు వేసే పనులు జోరందుకున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, నాగర్‌కర్నూల్


వరి నారును పరిశీలిస్తున్న రైతు


గుడిపల్లి రిజర్వాయర్‌కింద నాట్లు వేస్తున్న కూలీలు


నిండుగా పారుతున్న కేఎల్ఐ కాలువ


ట్రాక్టర్‌పై నారు తరలింపు


నాట్ల కోసం నారును సిద్ధం చేస్తున్న మహిళా రైతు కూలీలు


నారు తీసుకెళ్తున్న రైతులు


నాట్లు వేస్తున్న కూలీలు

నేటి తరానికి సావిత్రీబాయి ఆదర్శం


సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, టీఆర్ఎస్ నాయకులు

కొల్లాపూర్: సావిత్రీబాయి పూలే నేటి తరానికి ఆదర్శనీయమైన గొప్ప మహిళ అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కొల్లాపూర్‌లోని కేఎల్ఐ అతిథి గృహంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శతాబ్దం కాలం క్రితమే మహిళల విద్యాకోసం కృషిచేసిన మహనీయురాలని కొనియాడారు. జ్యోతిరావుపూలేతో కలిసి సమసమాజ నిర్మాణం కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. కుల, వర్గ, వర్ణరహిత సమాజ స్థాపన కోసం వారు చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, పసుపుల నర్సింహ్మ, చంద్రశేఖర్‌శెట్టి, చంద్రశేఖరాచారి, వేణుగోపాల్‌యాదవ్, రమేష్‌యాదవ్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగర్‌కర్నూల్ టౌన్: ఈనెల ఐదో తేదీన జిల్లాలోని పలు మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నాగర్‌కర్నూల్ డీఈ విద్యాసాగర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలకపల్లి, నాగర్‌కర్నూల్, తాడూరు మండలాల్లోని అన్ని గ్రామాలతో పాటు బిజినేపల్లి, ఊర్కొండ, పెద్దకొత్తపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్లకు నూతన లైన్లను ఏర్పాటు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

కాస్మోటిక్ కిట్లు పంపిణీ చేయండి

నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లను పంపిణీ చేస్తోందని, వీటికి ప్రతి విద్యార్థికి అందేలా జిల్లా విద్యాధికారి చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఈ.శ్రీధర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డీఆర్వో మధుసూదన్‌నాయక్, డీఈఓ జనార్దన్‌రావుతో పాటు బాలిక అభివృద్ధి అధికారి వరలక్ష్మిలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందించే కాస్మోటిక్ కిట్లను ఆయన పరిశీలించారు. గతంలో ప్రతి విద్యార్థికి కేవలం వంద రూపాయలే అందేవని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మేలు కలగనుందని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువగా ఉంటారని గుర్తించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి విద్యార్థినికి అందేలా కిందిస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలలకు సరిపడా టూత్‌పేస్ట్, ఒక బ్రెష్, టంగ్ క్లీనర్, షాంపోలు, కొబ్బరినూనె, రెండు బట్టల సబ్బులు, దువ్వెన, ఫేస్ పౌడర్, హ్యాండ్‌వాష్ లిక్విడ్, ఆలౌట్, బొట్టుబిళ్లలు, హెయిర్‌బ్యాండ్, రిబ్బన్లు, న్యాప్‌కిన్‌తో కూడిన వస్తువులు కిట్లలో ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 20 కేజీబీవీల్లో 3,249మంది విద్యార్థులు ఉన్నారని, వీరందరికీ వారం రోజుల్లో పూర్తిస్థాయిలో అందించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి కుర్మయ్య, విద్యా శాఖాధికారులు ఉన్నారు.


కాస్మోటిక్ కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

తిమ్మాజిపేట: మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాలను బుధవారం రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఇప్పలపల్లి, తిమ్మాజిపేట కేజీబీవీ, ప్రాథమికోన్నత పాఠశాలల ను వారు సందర్శించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియల్లో విద్యనందించాలని గతేడాది ఆగస్టులో ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం విద్యార్థుల సామర్థ్యం ఎంత వరకు మెరుగుపడిందో పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను రికార్డు చేసి గురువారం డీఈఓకు అందించనున్నట్లు మానిటరింగ్ కమిటీ సభ్యులు మధుసూదన్, రఘునాథ్ తెలిపారు. వారి వెంట ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కమిటీ

తంజావూర్‌లో కందనూలు కళాకారుల ప్రదర్శన

కందనూలు: సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో తమిళనాడులోని తంజావూర్‌లో నిర్వహించిన ''సలాంగినాదం'' ఉత్సావాలలో కందనూలు కళాకారులు ఉత్తమ ప్రదర్శన చేశారు. దేశంలో పలు రాష్ట్రాలకు చెందిన కళాకారుల బృందం ఈ ఉత్సవాల్లో సాంప్రదాయ నృత్యాలు చేశారు. తెలంగాణ నుంచి ఆదిలాబాద్ జిల్లా మాధురి బృందం గిరిజన నృత్యం చేసింది. కార్యక్రమానికి తమిళనాడు గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎన్ఎస్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు రామునాయక్, నాగరాజు మాట్లాడుతూ అకాడమీ స్థాపించిన నాలుగు నెలల్లోనే తమ కళాకారులు జాతీయస్థాయిలో ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజల ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ ఇలానే ఉంటే జాతీయస్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి కందనూలుకు మంచిపేరు తీసుకొస్తామని చెప్పారు.


తంజావూరులో నృత్య ప్రదర్శన చేసిన జిల్లా కళాకారులు



హలో సాక్షి..

అచ్చంపేట : 9440032423,
అచ్చంపేట రూరల్ : 9440821061
పదర : 9010719443,
లింగాల : 9951584583
ఉప్పునుంతల : 9441302253
బల్మూర్ : 9490142765
మన్ననూర్ : 9505507685,
అమ్రాబాద్ : 9490046935
దోమలపెంట : 9441759312

నిర్మించారు.. వదిలేశారు



దారారంలో నిరుపయోగంగా పంచాయతీ భవనం

లింగాల: మండలంలోని దారారం గ్రామంలో రూ.10లక్షలతో అన్ని హంగులతో పంచాయతీ భవనం నిర్మించారు. ఇంకా ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 9440032423

నిత్యం అవస్థలే!

- శిథిలావస్థలో ఎస్టీ బాలుర వసతి గృహం
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- కొత్త భవనం నిర్మించాలని వేడుకోలు



శిథిలావస్థకు చేరిన ఎస్టీ బాలుర వసతి గృహం



విద్యార్థుల సంఖ్యకు సరిపోని మరుగుదొడ్లు

లింగాల: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. దాంతో విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ చదువులు కొనసాగిస్తున్నారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత పోలీస్ స్టేషన్‌లో వసతి గృహాన్ని నిర్వహిస్తున్నా అన్ని విధాల అవస్థలు పడుతున్నారు. ఈ వసతి గృహంలో 274మంది విద్యార్థులు ఉన్నారు. సరైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

రోగాల బారిన విద్యార్థులు

వసతి గృహంలో ట్యాంకుల నుంచి వస్తున్న నీటిని తాగుతూ విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ఫిల్టర్ నీటిని సరఫరా చేయమని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

ఆరు బయటే స్నానాలు

వసతి గృహంలో 274మందికి సరిపోను మరుగుదొడ్లు లేక పోవడంతో సమస్యగా మారింది. స్నానాల గదులు లేక ఆరు బయట ప్లాట్‌ఫాంపై చేస్తూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త భవనం నిర్మించండి



పాత పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియదు. అన్ని హంగులతో కొత్త భవనాన్ని నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి. *– ప్రదీప్, 8వ తరగతి*

సమస్యలు పరిష్కరించాలి



వసతిగృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. నల్లానీటితోనే దాహం తీర్చుకుంటున్నాం. ఫిల్టర్ నీటిని సరఫరా చేయాలి. అలాగే స్నానపు గదులు నిర్మించాలి. *– ప్రకాష్, 6వ తరగతి*

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

శిథిలావస్థకు చేరిన భవనంలో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నాం. కొత్త భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలం గుర్తించి ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాం. అలాగే ఫిల్టర్ నీటిని అందించేందుకు కృషి చేస్తున్నాం. *– రాములునాయక్, హెచ్‌డబ్ల్యూఓ, లింగాల*

న్యూస్ బాక్స్

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంతటి మల్లేష్‌మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పాండుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా తలొగ్గేది లేదన్నారు. అమ్రాబాద్ మండలంలో మాదిగ ఉద్యోగిపై దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు విష్ణు, కాశీం, లక్ష్మీశ్వర్, ఉస్సేన్, వెంకటయ్య, రాజు, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

ఉప్పునుంతల: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వెంటనే చేపట్టాలని బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లె బాలయ్య, సొట కాశీం, బొల్లె లక్ష్మయ్య, దున్న లక్ష్మణేశ్వర్, నరేష్, సురేష్, రవి, శ్రీరాములు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎంఎస్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చింతల వెంటకయ్య, అనిల్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఆర్‌పీలు, డీఆర్పీలు

ఉప్పునుంతల: మండలంలో ఉపాధిహామీ పనులపై 9వ విడత సామాజిక తనిఖీలు ప్రారంభయ్యాయి. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ బృందాలు ఆయా గ్రామ పంచాయతీల వారీగా ఈజీఎస్ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో విలేజ్ సోషల్ ఆడిటర్స్ (వీఎస్‌ఏ)ను ఎంపిక చేశారు. 2016 ఆగస్టు నుంచి 2017 అక్టోబర్ వరకు రూ.4కోట్ల 12లక్షల 6948లతో చేపట్టిన ఈజీఎస్ పనులపై తనిఖీలు చేపట్టామని ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. తనిఖీల కోసం డీఆర్పీలతోపాటు గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపిక చేసిన వీఎస్‌ఏలకు ఈనెల 4న గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీలపై శిక్షణ ఇవ్వనున్నట్లు సామాజిక తనిఖీల ఎస్‌ఆర్‌పీలు జైప్రకాశ్, నరేష్‌లు తెలిపారు. గ్రామాల్లో ఈనెల 5నుంచి 10వరకు ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టిన పనులు, పీఆర్ రోడ్లు, నర్సరీలు, హరితహారం తదితర వాటిపై తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 12న మండలస్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

అమ్రాబాద్: పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో పశువులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మొత్తం 200 పశువులకు టీకాలు వేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈ వ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తగా ఈ టీకాలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది జనార్దన్, విష్ణు, నాసర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

లింగాల: మహారాష్ట్రలో భీమా కోరేగావ్ పోరాటానికి 200ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దళితులపై దాడులు చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సంఘటనను నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లె నిరంజన్, బాలాజీ, అశోక్, కుర్మయ్య, బాలరాజు, బోట్కరాజు, యాదయ్య, బాబు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

బీటీ రోడ్డు వేయాలి



లింగాల: మండలంలోని సూరాపూర్‌లో తెల్కపల్లి ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి బీటీ రోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలి. ప్రధాన మార్గం నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గం రాళ్లు తేలి గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి. *– కన్న, సూరాపూర్*

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి



లింగాల: ప్రభుత్వం ప్రకటించినట్లు గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి. చాలా మందికి నివాస గృహాలు లేక అవస్థలు పడుతున్నారు. ఇళ్లు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలి. *– వెంకన్న, సూరాపూర్*

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో



అచ్చంపేటలో

సాయిరాం: ఎంసీఏ

సత్యలక్ష్మి: హలో

లక్ష్మి: ఇఈ

సాక్షి మన అచ్చంపేట

నాగర్‌కర్నూల్

గురువారం | జనవరి | 4 | 2018



పూలేకు ఘన నివాళి

- వేడుకగా సావిత్రీబాయి జయంతి
- నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు



అచ్చంపేటరూరల్: నివాళులర్పిస్తున్న ఎంఈఓ తదితరులు



ఉప్పునుంతల : టీ-మాస్ ఆధ్వర్యంలో..

అచ్చంపేట రూరల్/ఉప్పునుంతల/ లింగాల/మన్ననూర్/అమ్రాబాద్/బల్మూర్: సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే జయంత్యుత్సవాలను అచ్చంపేట నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాలు, పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఆమె చేసిన సేవలను కొనియాడారు. అచ్చంపేట పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో నంద్యాల మాజీ ఎమ్మెల్యే నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆమె గొప్ప సంఘ సంస్కర్ధ అని కొనియాడారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు ఎంఎం గౌడ్, శ్రీశైలం, బాలీశ్వరయ్య, నిరంజన్, లక్ష్మణ్, మల్లేష్, ఎంఈఓ చందునాయక్ పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రాల్లో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లింగాల: గురుకుల పాఠశాలలో..



మన్ననూర్: నివాళుర్పిస్తున్న నాయకులు



అమ్రాబాద్: బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ



బల్మూర్: తుమ్మెన్‌పేటలో..

Zone Guide

రేపు మడేలయ బ్రహోత్సవాలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఉన్న మడేలయ ఆలయంలో ఈనెల 5న బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు రజక సేవా సంఘం అచ్చంపేట అధ్యక్షుడు సుంకరి లింగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు ఉట్లకోనేరు నుంచి మడేలయ ఆలయం వరకు రథోత్సవం ఊరేగింపుగా ప్రారంభం కానుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

6నుంచి డివిజన్‌స్థాయి క్రికెట్ టోర్నీ

బల్మూర్: నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని ఈనెల 6నుంచి గట్టుతుమ్మెన్‌లో డివిజన్‌స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మహేష్, శ్రీను, దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నిలో పాల్గొనే జట్లు ఈనెల 4న సాయంత్రం వరకు రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించాలని తెలిపారు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ

బల్మూర్: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీ రికార్డులను బుధవారం డీపీఓ వెంకటేశ్వర్లు పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీలో పనులు చేయకుండానే నిధులు కాజేశారని అనుబంధ గ్రామం కొత్తపల్లికి చెందిన సాయిని శ్రీశైలం, రమేష్‌ల ఫిర్యాదు మేరకు తనిఖీ చేసి తదుపరి విచారణ నిమిత్తం వాటిని స్వాధీనం చేసుకున్నట్లు డీపీఓ తెలిపారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

లింగాల: సూరాపూర్ పంచాయతీ పరిధిలోని మాడాపూర్‌లో 'స్వచ్ఛ భారత్ మిషన్ 'పథకంలో లబ్ధిదారులకు సర్పంచ్ రాజశేఖర్‌రావు, ఎంపీడీఓ వెంకట్‌ప్రసాద్ బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. 38మంది లబ్ధిదారులు మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించడంతో ఒక్కొక్కరికీ రూ.6వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలకు బ్లాక్‌బోర్డులు వితరణ

అమ్రాబాద్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి మాలె శంకరయ్య బుధవారం రూ.30వేల విలువచేసే 10బ్లాక్ బోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పాండు, ఉపాధ్యాయులు శంకరయ్యను సన్మానించారు.

నిందితులను శిక్షించాలి

దోమలపెంట: ఇటీవల వివిధ ప్రాంతాల్లో దళితులు, ముస్లింలపై దాడులు చేస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ దోమలపెంట గ్రామ అధ్యక్షుడు కె.మోయిజ్, ప్రధాన కార్యదర్శి శేఖర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

అచ్చంపేట రూరల్: కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని కౌన్సిలర్లు శ్రీనివాసులు, మనోహర్‌ప్రసాద్ కోరారు. బుధవారం పట్టణంలోని 12, 14 వార్డులలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి మహిళలకు అవగాహన కల్పించారు. చెత్తను ఇంటి వద్దకు వచ్చే రిక్షాల్లో వేయాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి వేయాలని కోరారు. ప్రతిఒక్కరూ స్మార్టు ఫోన్‌లో స్వచ్ఛతయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఖాన్, శమంత, అలివేల, మంగమ్మ, లక్ష్మమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

ఉప్పునుంతల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి (76) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గతనెల 18న ఉప్పునుంతల సమీపంలో ఆటో బోల్తా పడడంతో శ్రీనివాస్‌రెడ్డికి గాయాలు కాగా హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు.

సీఐ జహంగీర్‌కు సన్మానం

అమ్రాబాద్: అమ్రాబాద్ ఎస్ఐ జహంగీర్ యాదవ్‌కు సీఐగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కేంద్ర ప్రాథమిక పాఠశాల ఆవరణలో జహంగీర్‌కు పూలమాలలు, శాలువాలతో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలకిషన్, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు రాంజీ, దశరథం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం బీకే తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీదేవి, ఆమె భర్త బాలునాయక్‌పై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అమ్రాబాద్ పీఆర్ ఏఈ మహేందర్‌పై బుధవారం అచ్చంపేటలో దాడి జరిగినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనుదీప్ తెలిపారు. పీఆర్ ఏఈ మహేందర్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతల శ్యామ్ మాదిగ డిమాండ్ చేశారు.

రూ.37కోట్లతో 'భగీరథ' పనులు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట నగరపంచాయతీ పరిధిలో త్వరలోనే మిషన్ భగీరథ పనులను ప్రారంభిస్తామని, రూ.37కోట్ల నిధులతో ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం చేపడతామని మున్సిపల్‌శాఖ ఈఈ రమణమూర్తి అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని మధురానగర్, విద్యానగర్, టీచర్స్ కాలనీలో నిర్మించబోయే వాటర్ ట్యాంకు స్థలాలను డీఈ రియాజ్‌తో కలిసి పరిశీలించారు. మధురానగర్, టీచర్స్ కాలనీలో 15లక్షల లీటర్ల కెపాసిటీ, విద్యానగర్ కాలనీలో లక్ష లీటర్ల కెపాసిటీ సామర్థ్యంతో నీటి ట్యాంకులను నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ తులసీరాం, వైస్ చైర్మన్ బంధం రాజు, కమిషనర్ వెంకటస్వామి, సిబ్బంది మేఘనాథ్ గౌడ్, వెంకటయ్య, టీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌రావు, పోలిశెట్టి నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యానగర్‌లో స్థలం పరిశీలిస్తున్న ఈఈ రమణ

సమస్యలు పరిష్కరించాలి

లింగాల: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కలిసి సమస్యలను విన్నవించినట్లు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిరంజన్ బుధవారం తెలిపారు. కలిసిన వారిలో రాజు, చంద్రశేఖర్, బాలరాజు, నరేందర్, అనిల్‌కుమార్ ఉన్నారు.

క్రీడాకారులకు ఎంపిక పోటీలు

లింగాల: త్వరలో రాష్ట్రంలో డానియల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే మ్యాచ్‌లకు బుధవారం క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఐ విష్ణు ప్రారంభించారు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగంలో 18 మందిని ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ.పాండు, శ్యాంసుందర్‌గౌడ్, బాలాజీ, మహేష్ పాల్గొన్నారు.

గట్టుతుమ్మెన్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరం



ఎన్ఎస్ఎస్ వలంటీర్ల అవగాహన ర్యాలీ

బల్మూర్: అచ్చంపేట ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని గట్టుతుమ్మెన్, ఇప్పకుంట గ్రామాల్లో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) శీతాకాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వలంటీర్లతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ఏఓ కృష్టారావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాలల ప్రధానాచార్యులు జగపతిరావు, కె.మల్లయ్య, ఉపసర్పంచ్ మధుగౌడ్, మంజూర్ అహ్మద్, రవీందర్‌గౌడ్, భాస్కర్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, పర్వతాలు, శ్రీనివాసులు, లక్‌పతి చౌహాన్ పాల్గొన్నారు.

హలో సాక్షి..
కొల్లాపూర్ : 9705347090, 9492279709,
కొల్లాపూర్ రూరల్ : 9494271940,
పెద్దకొత్తపల్లి : 9948539858
పెంట్లవెల్లి : 9553196005,



మన కొల్లాపూర్
సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం | జనవరి | 4 | 2018

పౌష్టికం.. పుష్టికరం

- గురుకులాలు, పాఠశాలల్లో కొత్త మెనూ
- గుడ్లు, చికెన్ మటన్‌తో భోజనం
- ప్రతినిత్యం బూస్ట్, హార్లిక్స్‌తో పాలు
- సాయంత్రం స్నాక్స్, అల్పాహారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



కస్తూర్బా పాఠశాల

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాల, కస్తూర్బాలో ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ప్రారంభించిన కొత్త మెనూతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడంతోపాటు నాణ్యమైన భోజనం అందడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కస్తూర్బాలో జనవరి ఒకటి నుంచి అమలు చేస్తున్న కొత్త మెనూ వల్ల విద్యార్థులు భోజనం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం కస్తూర్బాలో 180మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో 220 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కొత్త మెనూతో నాణ్యమైన భోజనం అందించడంతో విద్యార్థులు ఇష్టంగా భోజనం చేస్తున్నారు. ఇప్పటి వరకు గురుకుల పాఠశాలలో సన్నబియ్యంతోపాటు గుడ్లు, పండ్లు ఇస్తున్నారు. కొత్త మెనూ అందించడం వల్ల వారానికి నాలుగు రోజులు గుడ్లు, నెలలో మూడు రోజులు చికెన్, రెండు రోజులు మటన్‌తో భోజనం ఏర్పాటు చేయనున్నారు.

కస్తూర్బాలో సమస్యలు

మండల కేంద్రంలోని కస్తూర్బాలో విద్యార్థులకు సైన్స్ పరికరాలు లేకపోవడంతో సైన్స్ పట్ల అవగాహన లేకుండా పోతోంది. అదనపుగదుల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో గదుల కొరతతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యలు..

మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో సొంత భవనం లేకపోవడం వల్ల విద్యార్థులకు క్రీడా మైదానం కరువై ఆటలకు దూరమవుతున్నారు. అదేవిధంగా సైన్స్‌పరికరాలు, కంప్యూటర్లు అందజేయకపోవడంతో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం లేకుండా పోతుంది.

అల్పాహార వివరాలు..

ప్రతిరోజూ ఉదయం విద్యార్థులకు ఆదివారం చపాతీ, సోమ, గురువారం ఇడ్లీ, మంగళ, శుక్రవారాల్లో రవ్వ ఉప్మా, బుధవారం పూరీ, శనివారం అటుకుల ఉప్మా అందజేసే మెనూ ఉంది. సాయంత్రం వేళ రోజూ స్నాక్స్ అందజేస్తారు. అలాగే సాయంత్రం పూట సోమవారం పెసర్లు, మంగళవారం బెబ్బర్లు, బుధవారం బొరుగులు, గురువారం అటుకులు, శుక్రవారం పల్లీపట్టీ, శనివారం గులాబ్‌జామ్, రెండో శనివారం సేమ్యాపాయసం, మూడో శనివారం రవ్వ కేసరి, నాలుగో శనివారం ఫ్రూట్ సలాడ్స్ అందిస్తున్నారు. కొత్త మెనూ వల్ల విద్యార్థులు ఇష్టంగా భోజనం చేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో స్వచ్ఛమైన నీరు..

కస్తూర్బాలో నీటిని శుద్ధి చేసేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది. గతంలో విద్యార్థులు బోరింగ్ నీరు తాగేవారు. ప్లాంట్ ఏర్పాటు చేయడంతో స్వచ్ఛమైన నీరు తాగుతున్నారు.



ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

నాణ్యమైన భోజనం అందుతోంది

రెండు రోజుల నుంచి కస్తూర్బాలో కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం ఆనందంగా ఉంది. పౌష్టికాహారం అందుతోంది.



– మేఘలత, 8వ తరగతి, కేజీబీవీ విద్యార్థిని

కొత్త మెనూ చాలా బాగుంది

కొత్తగా మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం రుచికరంగా ఉంది. విద్యార్థులకు పాలు, గుడ్లు అందించడంతో పౌష్టికాహార లోపం లేకుండా ఉంటుంది.



– ఎల్లమ్మ, పదో తరగతి, కేజీబీవీ విద్యార్థిని

వీధుల్లో పారుతున్న మురుగునీరు



నక్కలపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో డ్రెయినేజీ లేక మురుగు నీరంతా వీధులలో పారుతోంది. సీసీ రోడ్లు నిర్మించి డ్రెయినేజీ నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9492279709

న్యూస్ బాక్స్

కొల్లాపూర్‌లో సీసీఐ సభ్యుడి పర్యటన



పట్టణంలో పర్యటిస్తున్న అనిల్‌కుమార్

కొల్లాపూర్: నగరపంచాయతీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించేందుకు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి అనిల్‌కుమార్ బుధవారం పట్టణంలో పర్యటించారు. గత రెండు రోజులుగా ఆయన నగరపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. కొల్లాపూర్‌ను సంపూర్ణ బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా ప్రకటించే అంశాలను పరిశీలించేందుకు ఇక్కడ పర్యటించినట్లు అనిల్ కుమార్ విలేకరులకు వెల్లడించారు. ఆయనతోపాటు నగరపంచాయతీ కమిషనర్ రామలింగం, ఏఈ నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మణ్

పెద్దకొత్తపల్లి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేసినట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు. ఆర్బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్ పాఠశాలను ఎంఈఓ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి వారి గ్రేడింగ్‌లను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎల్‌ఈపీ టెస్టులు నిర్వహించి అందుకు సంబంధించిన వివరాలను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని సూచించారు.

కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని చంద్రబండ తండాలో ఎస్టీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి జెడ్పీటీసీ వెంకటయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల అభివృద్ధి కోసం గిరిజన తండాలను పంచాయతీలుగా గుర్తించిందని, దీంతో తండాలు అభివృద్ధిచెందుతాయన్నారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు చంద్రబండతండా డాలో ఎస్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ హన్మంతునాయక్, బాలు నాయక్, శంకర్‌నాయక్, కొండల్ రావు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

కేఎల్ఐ నీరు అందించాలి



పెద్దకొత్తపల్లి: కుమ్మరి గుట్టల నుంచి అసంపూర్తిగా ఉన్న డీ–7 పంట కాల్వను పూర్తి చేసి మొర్సు కుంట కింద రైతులకు సాగునీరు అందించాలి. ఏడాది నుంచి నీళ్లు రాకపోవడంతో దాదాపు 200 ఎకరాల రైతులు ఆందోళన చెందుతున్నారు. – బి.రాములు, రైతు, పెద్దకొత్తపల్లి

అసంపూర్తి కాల్వపనులు పూర్తి చేయాలి



పెద్దకొత్తపల్లి, బాచారం గ్రామాలకు కేఎల్ఐ నీటిని అందించే కాల్వలు అసంపూర్తిగా వదిలేయడంతో ఈ రెండు గ్రామాల రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టించుకుని అసంపూర్తి కాల్వపనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించి రైతులను ఆదుకోవాలి.

– రాంచంద్రయ్య, రైతు, పెద్దకొత్తపల్లి



వెండితెర



కొల్లాపూర్‌లో

వెంకటేశ్వర: ఎంసీఏ

సత్యసాయి: 2 కంట్రీస్

నేటి నుంచి తాపీ మేస్త్రీలకు ఉచిత శిక్షణ

కొల్లాపూర్‌రూరల్: నేటి నుంచి పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన నిర్మాణ మండలి సహకారంతో తాపీమేస్త్రీలకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంఘ మండల నాయకులు కర్నె రామచందర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. లేబర్ రిజిష్ట్రర్‌కార్డు ఉన్న వారు 18 నుంచి 45 సంవత్సరాల వరకు వయస్సు ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులని, 15 రోజులపాటు శిక్షణఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని తాపీ మేస్త్రీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాపీ మేస్త్రీల సంఘం నాయకులు శేషన్న, నర్సింహ్మా, కుర్మయ్య ఉన్నారు.

సావిత్రీబాయి పూలే ఆదర్శం



కొల్లాపూర్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పెద్దకొత్తపల్లి: నివాళులర్పిస్తున్న విద్యార్థులు



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీభాయి పూలే జయంతి నిర్వహించారు. ఆ సంస్థ నిర్వాహకులు కలమంద శేఖర్‌తో పాటు పలువురు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో టీ-మాస్ నాయకులు, ఎస్సీ (ఏ) హాస్టల్, గురుకుల పాఠశాల ల్లో కూడా సావిత్రీభాయి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మండల విద్యావనరుల కేంద్రంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొట్టమొదట స్త్రీ విద్యను ప్రోత్సహించిన సావిత్రీబాయి పూలేను బాలికలు ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదవాలని అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు శివ, రాంరెడ్డి, స్వామి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. పెంట్లవెల్లి పంచాయతీ వద్ద సావిత్రీబాయి జయంతిని తహసీల్దార్ వెంకటరమణ, సీపీఎం మండల కార్యదర్శి కుర్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల సురేందర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, ఎంపీటీసీ పల్లె నాగరాజు, ఎల్లయ్యగౌడ్, మాజీ వైస్ఎంపీపీ హన్మంతు, చిట్టెమ్మ, భాస్కర్, ఏఎన్ఎం మంజుల పాల్గొన్నారు.

కొల్లాపూర్‌రూరల్: మండల పరిధిలోని కుడికిళ్లలో సావిత్రీబాయి జయంతి వేడుకలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ బహుజన సమాజానికి వెలుగులు నింపిన వీర వనిత, మహిళలకు అక్షరజ్ఞానం చేసిన మేథావి సావిత్రీబాయి అని అన్నారు. అనంతరం కుడికిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సన్మానించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో సాక్షరభారత్ గ్రామ కో ఆర్డినేటర్లు మరుగుదొడ్లను నిర్మించుకునేలా ప్రోత్సహించాలని ఎంపీడీఓ రాంమోహన్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సాక్షరభారత్ గ్రామ కో ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇటీవల మృతి చెందిన నారాయణపల్లి గ్రామ సాక్షరభారత్ కో ఆర్డినేటర్ కుటుంబానికి రూ.2వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండల కోఆర్డినేటర్ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల చెక్కుల పంపిణీ

పెంట్లవెల్లి: మండలంలో సర్పంచ్‌కోట్ల సురేందర్ మరుగుదొడ్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈఎస్ఎల్ వారి ఆధ్వర్యంలో పెంట్లవెల్లిలోని మొదటి దశ ద్వారా 16మందికి ఒక్కొక్కరికి రూ. 6వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం సైదయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రభుత్వం రూ.12 వేలను అందిస్తుందన్నారు. ఏపీఎం సైదయ్య, గ్రామస్తులు కృపావరం, శ్రీను,వెంకటేష్, శివకుమార్, నరేష్, మహిళలు పాల్గొన్నారు.

స్ఫూర్తి సభను జయప్రదం చేయండి

కొల్లాపూర్‌రూరల్: ఈ నెల 4న పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే మహనీయుల స్ఫూర్తి సభను ప్రజాస్వామికవాదులు, మేథావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నవ నిర్మాణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌గుప్త పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహనీయుల స్ఫూర్తి బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సభకు రాష్ట్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ కోదండరాం హాజరవుతున్నారని అన్నారు. మేథావులు, ప్రజాస్వామికవాదులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నవ నిర్మాణ వేదిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీధర్‌గుప్త

సోమశిల అందాలు అద్భుతం



విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ సైదులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల దగ్గర కృష్ణానది పరిసరాలు, అందాలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ సైదులు అన్నారు. బుధవారం ఆయన ఓ కేసు విచారణ నిమిత్తం కొల్లాపూర్ కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా సోమశిలకు వెళ్లి కృష్ణానది అందాలను తిలకించారు. బోటులో పర్యటించి నదిలో పరిసరాలను కలియదిరిగారు. అనంతరం సోమశిల కృష్ణానది ఒడ్డున జరుగుతున్న టూరిజం పనులను పరిశీలించారు. సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని కేఎల్ఐ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. సోమశిల అందాలు అద్భుతంగా ఉన్నాయని, ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 2013లో ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇక్కడ ఇన్ని వసతులు ఉండేవి కాదని, ప్రస్తుతం అన్ని రకాలుగా కొల్లాపూర్ అభివృద్ధి చెందిందన్నారు. అంతకు ముందు డీఐజీకి మంత్రి వ్యక్తిగత కార్యదర్శి జూపల్లి రామారావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట సత్యనారాయణలు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. పాలమూరు జిల్లా జైళ్ల శాఖ సూపరింటెండెంట్ శివకుమార్, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

Zone Guide

ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు

కొల్లాపూర్: మండలంలోని రామాపురంలో ప్రభుత్వ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటుచేశారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను బుధవారం కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ బచ్చల కూర బాలరాజులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేసే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటుచేసినట్లు వివరించారు. గ్రామంలో వారం రోజులపాటు శిబి రం కొనసాగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ శిబి రం నిర్వహణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వెంకటేశం, అధ్యాపకులు దేవరాజ్, అశోక్, నరసింహ్మా, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

కొల్లాపూర్‌రూరల్: అరెస్టుల, నిర్బంధాల ద్వారా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మాదిగల ఉద్యమాన్ని ఆపలేరని దండోరా జిల్లా నాయకుడు కోళ్ల శివ మాదిగ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి మాదిగలపై చిత్తశుద్ధి లేదన్నారు. వర్గీకరణ సాధనకు ఒకపక్క మద్దతిస్తున్నామని చెబుతూనే దండోరా అధినాయకున్ని అరెస్ట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఉపవాస దీక్ష చేస్తున్న మందకృష్ణను అకారణంగా అరెస్ట్‌చేసి నిర్బంధిస్తున్నారన్నారు. వర్గీకరణ చేయకుంటే ఎంతకైనా తెగిస్తా మన్నారు. నాయకులు పుట్టపాగ రాము, బోరెల్లి కృష్ణయ్య ఉన్నారు.

పెంట్లవెల్లి: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణను సికింద్రాబాద్‌లోని సంస్థ జాతీయ కార్యాలయంలో చేపట్టిన 48గంటల శాంతియుత దీక్షను పోలీసులు భగ్నం చేసి అరెస్ట్ చేశారని, మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్‌చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడతామని చెప్పి ఇంత వరకు ఆ మాటెత్తడం లేదన్నారు. ఇప్పటికైనా వర్గీకరణ బిల్లును ఆమోదించాలని బాల్‌రాజు, పరుశరాములు, రాంచంద్రయ్య, రాజు, బాలస్వామి, కుర్మయ్య, రామస్వామి డిమాండ్ చేశారు.

పథకాలపై రైతులకు అవగాహన

పాన్‌గల్: ప్రధానమం త్రి క్రిషి సించాయ్ యో జన(పీఎంకేసీవై) పథ కంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవా రం మండలంలోని అన్నారం, దావాజిపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ హరి త మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై పైపులు, బోరు మోటర్లు అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పట్టాదా రు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాం కు అకౌంటు పుస్తకం జిరాక్స్ కాపీలు, ఒక ఫోటో జతపర్చి వ్యవ సాయ కార్యాలయంలో అందజేయాలన్నా రు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మహేష్‌నాయుడు, ఠాకూర్‌నాయక్ పాల్గొన్నారు.

హలో సాక్షి..

కల్వకుర్తి : 9440779792,
కల్వకుర్తి రూరల్ : 9440981915 9032233947
ఊర్కొండ : 7036132223
వెల్దండ : 9963054732,
వంగూరు : 9705347073,
చారకొండ : 9666614959,



మన కల్వకుర్తి

సాక్షి

నాగర్‌కర్నూల్

గురువారం | జనవరి | 4 | 2018

నిరుపయోగంగా మూత్రశాలలు



వెల్దండ బస్టాండ్ ఆవరణలో నిరుపయోగంగా మూత్రశాలలు

వెల్దండ: స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. దాంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్ : 9440032423

ఇలా ఎన్నాళ్లు?

- పాఠశాలల్లో ఆరుబయట వంటలతో అవస్థలు
- తరగతిలోకి వస్తున్న పొగ.. విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



పోతేపల్లిలో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనానికి ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో నిర్వాహకులు ఆరుబయటే వంటలు చేస్తున్నారు. దీంతో తరగతి గదులోకి పొగ రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులుల ఇబ్బందులు పడుతున్నారు. వెల్దండ మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత, 45ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 25 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, నాలుగు ఉన్నత పాఠశాలల్లో వంటగదులు లేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతుకు నోచని వంటగదులు

మండలంలోని వివిధ పాఠశాలల్లోని వంట గదులు మరమ్మతుకు చేరుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గతంలో వీచిన ఈదురు గాలులకు వంటగది పైకప్పు లేచిపోయింది. వాటిని మరమ్మతు చేయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.



వెల్దండ మోడల్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థుల అవస్థలు

వంట ఏజెన్సీకి తప్పని తిప్పలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయట వంటలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి విద్యార్థులకు ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతం. ఆరుబయట వంటలు చేస్తుండడంతో తరగతి గదుల్లోకి పొగలు రావడంతో విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టడం లేదు. వంట గదులు లేకపోవడంతో వంటసామగ్రికి భద్రత లేకుండా పోయింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలల్లో వంటగదుల నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఆరుబయట వంట చేయడానికి నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. మోడల్ హైస్కూల్‌లో భోజనం చేయడానికి షెడ్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వంట గదుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయించి సమస్య పరిష్కరిస్తాం.

– రాంగోపాల్, ఎంఈఓ, వెల్దండ

వాసవీక్లబ్ నూతన కమిటీ ఎన్నిక

వెల్దండ: వాసవీక్లబ్, వనితాక్లబ్ వెల్దండ మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా పూరిశివకుమార్, కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, పీఆర్‌ఓగా రాజయ్య తోపాటు సభ్యులను ఎన్నికున్నారు. వనితాక్లబ్ అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి, కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా సుప్రియ, పీఆర్‌ఓ పద్మతో పాటు సభ్యులను ఎన్నుకుని నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ రమేష్ , సభ్యులు రమేష్, కోటీశ్వర్, శ్రీను, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కమిటీకి నియమాకపత్రం అందజేస్తున్న రమేష్

న్యూస్ బాక్స్

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

చారకొండ: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలని ఆంధ్రాభాంక్ మేనేజర్ కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని సిరసనగండ్ల, అగ్రహారంతండాలో సంఘదర్శిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నర్సయ్యగౌడ్, సీసీ మాధవి, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

వెల్దండ: వెల్దండ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్‌ను సంఘం మండల అధ్యక్షుడు బచ్చురామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రమేష్, కోటేశ్వర్, శ్రీను, శివకుమార్, కృష్ణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరణ

కల్వకుర్తి రూరల్: యూటీఎఫ్ క్యాలెండర్లను బుధవారం పట్టణంలోని ఆ యూనియన్ కార్యాలయంలో ఎంఈఓ బాసూనాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సర్దార్ నాయక్ ఖాదర్‌పాష, మల్లయ్య, వెంకటేశ్వర్లు, రామేశ్వరయ్య, చిన్నయ్య, శ్రీనివాసులు, బాలరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగూరు: యూటీఎఫ్ క్యాలెండర్లను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, ఎంఈఓ శంకర్‌నాయక్, నాయకులు గణేష్‌రావు, హమీద్, చిన్నయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, పర్వతాలు, రాములు, శ్రీనివాసులు, లింగమయ్య, జంగయ్య, కృష్ణయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములు కొల్పోతున్న రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

వెల్దండ: డిండి – నార్లాపూర్ ప్రాజెక్టు ద్వారా నల్గొండ ప్రాంతానికి నీటిని తరలించడానికి ఏర్పాటు చేస్తున్న కాల్వ పనులో భూములు కొల్పోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిందం కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎర్రవల్లి, గోకారం, అజిలాపూర్, శేరిఅప్పారెడ్డిపల్లి, బైరాపూర్ గ్రామాల రైతులు కాల్వ పనుల్లో భూములను కొల్పోతున్నట్లు తెలిపారు. ప్రతి ఎకరానికి రూ.12లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలస్వామి, కృష్ణారెడ్డి, జంగయ్యయాదవ్, శ్రీనివాసులు, జనార్దన్, కొండల్, శివప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంముదిరాజ్ పాల్గొన్నారు.

పింఛన్ అందక వృద్ధుల అవస్థలు



నిరసన తెలుపుతున్న వృద్ధులు

వెల్దండ: పింఛన్లు అందక వృద్ధులు పలు అవస్థలు పడుతున్నారు. బుధవారం స్థానిక పోస్టాఫీస్‌కు ఫించన్ కోసం పలువురు వృద్ధులు వచ్చారు. ఇంకా డబ్బు రాలేదని చెప్పడంతో అక్కడే బైఠాయించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. నవంబర్, డిసెంబర్ పింఛన్లు ఇంతవరకు చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

లోకల్ వాయిస్

ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలి



వెల్దండ: ప్రభుత్వం గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు గుర్తించాలి. 500జనాభా ఉన్న తండాలను గుర్తించి రామో ఎన్నికల సమయానికి పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించి వెంటనే ప్రకటన జారీ చేయాలి.

– లాలునాయక్, ఈదమ్మబండ తండా

కమ్యూనిటీ భవనాలు నిర్మించాలి



వెల్దండ: ముదిరాజ్ కులస్తులకు కమ్యూనిటీ భవనాలను నిర్మించాలి. అలాగే సబ్సిడీపై రుణాలు అందజేసి యువకులకు ఉపాధి కల్పించాలి. ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చాలి. ఏళ్లుగా పోరాటం చేస్తున్న సమస్య తీరడం లేదు. ప్రత్యేక రాష్ట్రంలోనైనా సమస్యను పరిష్కరించాలి.

– వెంకటయ్య ముదిరాజ్, వెల్దండ

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

వెండితెర



కల్వకుర్తిలో..
పార్థసారధి : ఆక్సిజన్
అశోక : ఇంద్రసేన
నేషనల్ : జవాన్

పూలేకు ఘన నివాళి

- వేడుకగా సావిత్రీబాయి జయంతి
- నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు



కల్వకుర్తి రూరల్: మార్చాలలో నివాళులర్పిస్తున్న నాయకులు



కల్వకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న డీఎస్పీ ఎల్‌సీ నాయక్

కల్వకుర్తి రూరల్/కల్వకుర్తి టౌన్/వంగూరు/వెల్దండ/ఊర్కొండ/చారకొండ: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంత్యుత్సవాలను కల్వకుర్తి నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం స్వేరోస్, బీసీ సంక్షేమ సంఘం, బీఎస్పీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డీఎస్పీ ఎల్‌సీ నాయక్ పాల్గొన్నారు. ఆయా మండలాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వంగూరులో..



ఊర్కొండలో..



వెల్దండలో..

Zone Guide

రేపు బీజేపీ ఆధ్వర్యంలోధర్నా

వెల్దండ: డిండి – నార్లాపూర్ ప్రాజెక్టు ద్వారా నల్గొండ ప్రాంతానికి నీటిని తరలించడానికి ఏర్పాటు చేస్తున్న కాల్వ పనులో భూములు కొల్పోతున్న రైతులను ఆదుకోవాలని ఈనెల 5న కల్వకుర్తి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిందం కృష్ణయ్య తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు, పార్టీ నాయకులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి భాగ్‌స్థాయి క్రీడలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 7వరకు భాగ్‌స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, భాగ్ కన్వీనర్ లక్ష్మీకాంత్, నగర కార్యదర్శి లల్లు ప్రసాద్ చెప్పారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ధర్మ దీక్ష పోస్టర్లు ఆవిష్కరణ

ఊర్కొండ: సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఈనెల 7న గజ్వేల్‌లో నిర్వహించనున్న ధర్మదీక్ష పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ రాంరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, ప్రకాశ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

వెల్దండ: రుణాలు మంజూరు చేయాలని మండలంలోని ఎస్సీ నిరుద్యోగులు కోరారు. బుధవారం హైదారబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ జీఎం ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గోరటి శ్రీనివాస్, యువకులు జంగయ్య, ప్రేమ్, కుమార్, మల్లేష్, రాములు, శేఖర్, రాజు, పాండు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

చారకొండ: మండల కేంద్రంలో ఎస్‌ఐ పోచయ్య ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంక్ డ్రంకెన్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్రకు చెందిన ఫొటోగ్రాఫర్ అల్లాజీ గతనెల 30న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం కల్వకుర్తి ఫొటో, వీడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.12,500 అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, మోహిన్‌ఖాన్, రవి, వాహిద్, గోవర్ధన్, అనిల్, జంగయ్య, తన్వీర్, హసన్, శంకర్, సందీప్ పాల్గొన్నారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’పై అవగాహన

కల్వకుర్తి టౌన్: ‘స్వచ్ఛ సర్వేక్షణ్’పై బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఖాజా, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ గ్రామ కమిటీ ఎన్నిక

చారకొండ: గోకారంలో బుధవారం నాయీబ్రాహ్మణ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్, కార్యదర్శులుగా సత్య, శ్రీను, భాస్కర్, 10మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, మురళి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

వెల్దండ: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు నాయకులు జంగయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన మానిటరింగ్ సభ్యులు



కల్వకుర్తి రూరల్: రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



వంగూరు: కేజీబీవీలో..

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్/వంగూరు: కల్వకుర్తి పట్టణంతో పాటు ఆయా మండలాల్లోని వివిధ పాఠశాలలను విద్యాశాఖ మానిటరింగ్ కమిటీ సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని జెడ్పీ బాలిక పాఠశాలలో ప్రార్థన సమయానికే కమిటీ సభ్యులు హాజరయ్యారు. 28 మంది ఉపాధ్యాయులు పాఠశాలలో ఉండగా ప్రార్థనకు 11మంది రావడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యుల వెంట ఆయా మండలాల విద్యాధికారులు, హెచ్‌ఎంలు ఉన్నారు.

రామారెడ్డి జ్ఞాపకార్థం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కల్వకుర్తి: ముకురాలకు చెందిన సాహితీవేత్త రామారెడ్డి జయంత్యుత్సవాలను బుధవారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం యాదగిరి రచించన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రుక్మాంగదరెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరి, ముత్యాల కృష్ణయ్య, గన్నవరం నిర్మల, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



శబరిమలకు వెళ్తున్న మాలధారులు

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప మాలధారులు బుధవారం శబరిమలకు తరలివెళ్లారు. అంతకుముందు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ చిందం లక్ష్మి, లలిత, జంగయ్యయాదవ్, నాయకులు చిందం కృష్ణయ్య, శ్రీనివాసులు, బాలస్వామి, గురుస్వామలు, కత్తిస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు పోస్ట్‌కార్డులు పంపారు. బుధవారం పట్టణంలోని పాలమూర్ చౌరస్తాలో ఓయూ జేఏసీ అధ్యక్షుడు కల్వకుర్తి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సదానందన్‌గౌడ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డులు వేస్తున్న నాయకులు

ఇంటర్వ్యూ

అంతరాయం లేకుండా చూస్తాం

శ్రీధర్, ఏఈ, విద్యుత్ శాఖ, వెల్దండ

(అంశం : 24గంటల విద్యుత్ సరఫరా)



వెల్దండ: ప్రభుత్వం రైతులకు వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ శ్రీధర్ తెలిపారు. ఏమైన సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందించి మరమ్మతులు చేయిస్తామని బుధవారం ఆయన సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి.?
జవాబు: మొత్తం 6 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి.
ప్రశ్న: ఎన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.?
జవాబు: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో వ్యవసాయ కనెక్షన్లు 6,200 ఉన్నాయి.
ప్రశ్న: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందా.?
జవాబు: సబ్‌స్టేషన్‌లో సరిపడా విద్యుత్ సిబ్బంది ఉన్నారు.
ప్రశ్న: నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఎన్ని రోజుల్లో పంపిణీ చేస్తారు.?
జవాబు: రైతులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.4,950 డీడీ చెల్లించాలి. రెండు నుంచి ఐదు డీడీలు చెల్లించిన రైతులకు 16కేవీ, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అందజేస్తాం. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయడానికి 30నుంచి 45రోజులు పడుతుంది.
ప్రశ్న: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నయా.?
జవాబు: ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్తింగ్ సమస్య ఉంటే పరిష్కరించాం. ఇళ్లపై వేళాడుతున్న విద్యుత్ వైర్లను తొలగిస్తున్నాం.

- అయ్యప్ప పడిపూజలో ఆకట్టుకునేలా మండపాలు
- నైపుణ్యం ఉట్టిపడేలా తయారీలో దిట్ట.. రవి



అయ్యప్ప దేవాలయంలో అలంకరణ చేస్తున్న రవి

పూజలో ప్రత్యేకం..
తయారీలో నైపుణ్యం

అచ్చంపేట రూరల్: నవంబర్ మొదలు జనవరి వరకు అయ్యప్ప మాల ధరించిన వారు మనకు తారస పడుతుంటారు. ఈ సమయంలో ప్రతిరోజూ ఏదో ఓ భక్తుడి ఇంట్లో లేదా ఆలయాల్లో పడిపూజలు జరుగుతుంటాయి. ఈ పూజల్లో మండపాలకు ఉన్న ప్రాధాన్యత అంతాఇంత కాదు. ఈ మండపాల తయారీలో ప్రావీణ్యత కనబరుస్తున్నారు అచ్చంపేటకు చెందిన కాకునూరి రవి.

నిర్మాణం ఇలా...

పడిపూజలో మండపాలకు 35 పెద్ద అరటి చెట్లు అవసరమవుతాయి. మండపం నిర్మాణానికి ఐదు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. అరటి చెట్లతో రకరకాల బొమ్మలు తయారు చేయడంతో పాటు, ఒక్కో చోట అక్కడి అయ్యప్ప భక్తుల కోరిక మేరకు మూడు మంటపాలను, ఐదు మంటపాలను వేస్తారు. అరటి చెట్లతో పాటు రెండు, మూడు అంగుళాల కర్ర మేకులు అవసరమవుతాయి. మండపంలో రంగురంగుల విద్యుద్దీపాలను, అందమైన రంగుల వస్త్రాలతో అలంకరిస్తారు.



అరటి మొక్కల బెరడుతో పూలు తయారు చేస్తున్న దృశ్యం

పునరావృతం కాకుండా..

అయ్యప్ప పూడి పూజకు అవసరమయ్యే మండపాలు వేయడంలో అచ్చంపేటకు చెందిన కాకునూరి రవి మంచి గుర్తింపు ఉంది. ఒకచోట వేసిన మండపం నమూనా మరో చోట కనిపించకుండా వేయడం ఈయన ప్రత్యేకత. రవి పదేళ్లుగా అచ్చంపేట పరిసర గ్రామాల్లో అరటి చెట్లతో అందమైన మండపాలను తీర్చిదిద్దుతూ పేరు సాధించారు.

సేవ చేయడం ఆనందంగా ఉంటుంది



అరటి మండపాలను ఉచితంగా వేస్తుంటాను. అయ్యప్ప సేవలో ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. నా మిత్రుడు వెంకటరమణాచారి సహకారంతో ఇప్పటి వరకు ఎన్నో మండపాలు నిర్మించాను. ఒక్కో పడిపూజ వద్ద వేర్వేరుగా నమూనాలు వేస్తుంటాను. ప్రస్తుతం అరటి మండపాల కంటే రెడీమేడ్ నిర్మాణాలపై పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. – కాకునూరి రవి



రవి రూపొందించిన మండపం

చీకటిని జయించారు..

నేడు ప్రపంచ అంధుల దినోత్సవం

- ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్న అంధులు
- 'కళ్లు' లేకపోయినా 'అక్షర జ్ఞానం'
- ఇతరులకు దిక్సూచిగా నిలుస్తున్న దివ్యాంగులు

మహబూబ్‌నగర్ రూరల్: మానవ దేహంలో 'కళ్లు' అతి ముఖ్యమైనవి. నిత్యం ఏ పని చేయాలన్నా.. ఎక్కడికి వెళ్లాలన్నా.. కంటి చూపే ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే విటమిన్ల లోపంతో పుట్టుకతోనే అంధత్వానికి గురైన వారు కొందరు తమ దైనందిన కార్యకలాపాలను చక్కదిద్దుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అయితే, మరికొందరు మాత్రం చీకటిని చీల్చుకుని ముందుకు సాగుతూ మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక అంధుల మంచి మనస్సును చూసి వివాహమాడిన పలువురు వారికి కంటి చూపై నిలుస్తున్నారు. అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం ప్రపంచ అంధుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ఒకరికి ఒకరై..



వారిద్దరు అంధులే.. కానీ వీరి దాంపత్యాన్ని ఆ దేవుడు నిర్ణయించాడు. కళ్లు లేకున్నా జీవితాంతం ఒకరికి ఒకరై తోడుంటామని బాస చేశారు. మూడు ముళ్ల బంధంతో ఏకమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన బి.రాఘవేందర్‌రెడ్డి, షాద్‌నగర్‌కు చెందిన జి.అరుణ ఇద్దరికీ మధ్యలో కళ్లు పోయాయి. కానీ ఆత్మస్థైర్యంతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. వీరిలో రాఘవేందర్ ధర్మాపూర్ పీఎస్‌లో, అరుణ మోతీనగర్ పీఎస్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె. ఈ దంపతులు తమకు కళ్లు లేవన్న బాధను మరచిపోయి జీవన యానం సాగిస్తున్నారు.

ఒక్కటి చేసిన ప్రేమ



ఈ దంపతులను ప్రేమ ఒక్కటి చేసింది. మనస్సుతో ప్రేమించుకుని, అర్థం చేసుకుని వివాహం చేసుకున్నారు. హన్వాడ మండలం లింగన్నపల్లికి చెందిన మాధవులు మూడేళ్ల వయస్సులో తన రెండు కళ్లు కోల్పోయారు. అయినప్పటికీ ఎంతో కష్టపడి ఐఎంఎ టీపీటీ చదివాడు. ఐఓబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించాడు. ఈయన ఎల్కిచర్ల మండలం బేరంగూడెంకు చెందిన మానసను గత ఏడాది ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈమె కూడా పుట్టుక నుంచి అంధురాలే. వీరి ప్రేమకు అంధత్వం ఎప్పుడూ అడ్డురాలేదు.

మనస్సును అర్థం చేసుకుని..



ప్రతిఒక్కరు తమ కన్నా అందమైన, మంచి మనస్సు ఉన్న వారిని వివాహం చేసుకోవాలని అనుకుంటారు. కానీ ఆమె మాత్రం మనస్సు బాగుంటే చాలు.. వైకల్యం పెళ్లికి అడ్డు రాదని నిరూపించింది. మక్తల్ మండలం బొందల కుంటకు చెందిన దాసరి చెన్నయ్యకు అంతగా కళ్లు కనిపించవు. ఆయన ప్రస్తుతం మహబూబ్‌నగర్ రూరల్ మండలం చౌదర్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఆయన మంచి మనస్సును అర్థం చేసుకున్న వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వరలక్ష్మి వివాహం ఆడింది.

ఆమె కళ్లే ఆయనకు లోకం



ఆమెకు రెండు కళ్లు ఉన్నాయి.. భర్తకు మాత్రం కళ్లు లేవు. అయితే తన రెండు కళ్లతో భర్తకు లోకాన్ని చూపిస్తోంది. లోకం చూడని ఆయన జన్మకు పెద్ద మనస్సై తోడైంది. ఆమే వనపర్తికి చెందిన లతాసుప్రియ. మక్తల్ మండలం బొందల కుంటకు చెందిన రెండు కళ్లు లేని జయరాములును నెల క్రితం వివాహం చేసుకుంది. ప్రస్తుతం జయరాములు వనపర్తి జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వీరిద్దరు ఎంతో అన్యోన్యంగా ఉంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



బ్రెయిలీ లిపి ద్వారా అంధులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- 12మందితో ప్రారంభమైన ఆశ్రమ పాఠశాల
- ప్రస్తుతం 80 మందికి ఆశ్రయం
- ఇక్కడ చదువుకున్న వారిలో పలువురు ఉన్నత స్థాయికి..
- అధ్యాపకులను నియమిస్తే మరింత అభివృద్ధి

అంధులకు అండ

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అంధుల ఆశ్రమ పాఠశాల అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. 1987 సంవత్సరంలో 12 మందితో ఈ పాఠశాల ప్రారంభమైంది. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ చదువుకున్న ఎందరో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం.

అధ్యాపకులను నియమిస్తే..

అంధుల ఆశ్రమ పాఠశాల 12 మందితో ప్రారంభం కాగా.. ఇప్పుడు 80 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే, పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసినా అధ్యాపకులను నియమించలేదు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులే అధ్యాపకులుగా వ్యవహరిస్తూ అంధులకు విద్యాబోధన చేస్తున్నారు. అధ్యాపకులను కూడా నియమిస్తే ప్రస్తుతం ఆ పాఠశాలలో నివాసముంటున్న అంధులు మరింత అభివృద్ధి సాధిస్తారని చెప్పొచ్చు.



మహబూబ్‌నగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాల


బ్రెయిలీ లిపితో బోధన

ఎలాంటి అండదండలు లేకుండా గడుపుతున్న అంధుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ ఆశ్రమ పాఠశాల దోహదం చేస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన బ్రెయిలీ లిపి ద్వారా ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. సహజంగా చురుకుగా ఉండే అంధులు ఎంతో ఓర్పు.. నేర్పుతో విద్యాభ్యాసం చేస్తూ తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన చాలామంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు సాధించి మిగతా వారి కంటే తామేం తక్కువ నిరూపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 80 మంది అంధులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



బ్రెయిలీ లిపి అభ్యసిస్తున్న విద్యార్థి

పాఠశాల ఆవరణలోని లూయిస్ బ్రెయిలీ విగ్రహం



శ్రమ పడితే సాధించలేనిది ఏదీ లేదు



లూయిస్ బ్రెయిలీ లిపి ద్వారా గౌరవప్రదమైన స్థాయికి అంధులు ఎదుగుతున్నారు. ఆధునిక యుగంలో కంప్యూటర్ వ్యవస్థను కూడా అంధులకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రతీ విషయంలో శ్రమ పడితే సాధించదంటూ ఏమీ లేదు. దేనినైనా కృషితో సాధించాలి. – రాములు, ప్రిన్సిపాల్, అంధుల ఆశ్రమ పాఠశాల



ఆలయం వద్ద ట్రాక్టర్లతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అహో... శకటోత్సవం

బాలానగర్ మండల పరిధిలోని పెద్దరేవల్లి గ్రామంలో శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం శకటోత్సవం నిర్వహి/ ం చారు. వివిధ గ్రామాల ప్రజలు గొర్రె పొట్టేళ్లు, ఎడ్ల బండ్ల రథాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఇంకా ఆటోలు, ట్రాక్టర్లు, లారీల్లో సైతం భక్తులు తరలివచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు. జాతరకు వేలాదిగా భక్తులు హాజరుకాగా, తినుబండారాలు, ఆటవస్తువుల దుకాణాలు పెద్దసంఖ్యలో ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ చైర్మన్ సాదు వెంకట్‌రెడ్డి, సర్పంచ్ మాధవి రఘుమారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, జెడ్పీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

– బాలానగర్(జడ్చర్ల)



జాతరకు భక్తులు తీసుకొచ్చిన పొట్టేళ్ల బండ్లు



శకటోత్సవానికి ముస్తాబైన ఎద్దుల బండ్లు